ప్రజాశక్తి

Vol. 3, no. 4

(Jul. 28, 1943)

బెజవాడ, 1943

Record no. 683

Prajāśakti

Vol. 3, no. 4

(Jul. 28, 1943)

Bejavāḍa, 1943

Record no. 683

8 పేజీలు : 0-2.0

PRAJASAKTI

Regd. No. M. 4486

: సంపాదకవర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు
(సంపాదకుడు)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు.

ప్రజాశక్తి

★
భారత కమ్యూనిస్టుపార్టీ
ఆంధ్రకమిటీ పత్రిక
★

సంపుటి 3 | బుధవారం 28-7-43 బెజవాడ | సంచిక 4

★ దేశద్రోహుల కార్యక్రమం: మరొక ఆగస్టు 9

దేశభక్తుల కర్తవ్యం శాంతిని కాపాడడం

మన దేశచరిత్రలో ఆగస్టు 9 చాల ముఖ్యమైన దినం. ఏడాదికిందట, దేశానికి ఫాసిస్టు ప్రమాదం ఎంతో అధికంగా ఉంటుండగా, సరిగా ఇదే రోజున సామ్రాజ్యవాద ప్రభుత్వం మనజాతీయోద్యమాన్ని అణచివేయడానికి పూనుకొంది. మనదేశంయొక్క రక్షణతో చెలగాటమాడింది. ప్రజల్ని రెచ్చగొట్టడానికి ఎన్నెన్ని చేయాలో అన్నీ చేసింది. ఇది దేశభక్తు లందరికీ తెలుసు.

ఆనాడే, ప్రజల ఉద్రేకాన్ని అండగా తీసుకొని పంచమాంగదళం రంగంలోకి వచ్చింది. దేశమంతటా విధ్వంసక కార్యక్రమాన్ని సాగింప జూసింది. కాని ఈ విషయాన్ని కాంగ్రెసు దేశభక్తుల్లో ఎక్కువమంది ఇంకా గుర్తించడంలేదు. ఉద్రేకపూరితులై, తప్పుదారి తొక్కుతున్న దేశభక్తులే ఈ కార్యక్రమానికి కారకులని వీరి భ్రమ.

దేశ ద్రోహులు

అనేకచోట్ల కాంగ్రెసు సోషలిస్టులు, కొన్నిచోట్ల ఫార్వర్డుబ్లాకువారు, కాంగ్రెసు యంత్రాన్ని స్వాధీనం చేసుకొని, కాంగ్రెసు పేరుతో వ్యవహరించడం ప్రారంభించారన్న సంగతి దేశభక్తు లందరికీ తెలిసిందే. ఈ వ్యవహారాలు కాంగ్రెసు అధికారంతో జరుగుతున్నవి కావనీ, కాంగ్రెసు విధానానికి విరుద్ధమైనవనీ, గాంధీజీ వైస్రాయికిరాసిన జాబుల్లో స్పష్టంచేశాడు.

ఈ నాటి ప్రధాన సమస్య అన్నిటిమీద కాంగ్రెసు సోషలిస్టుపార్టీ, ఫార్వర్డుబ్లాకుల వైఖరులు కాంగ్రెసు వైఖరికి పూర్తిగా విరుద్ధం. ఎలాగో చూదాం.

1. కాంగ్రెసు ఫాసిస్టు ప్రతికూల సంస్థ.

ఫార్వర్డుబ్లాకువారో, జపాను సేనలతో బోసు వస్తున్నాడు ఇండియాను చెరవిడిపించ డానికని బాహాటంగా చాటుతున్నారు.

కాంగ్రెసు సోషలిస్టులు తమకు బ్రిటిషువారన్నా, జపానువారన్నా ఇష్టంలేదంటారు. కాని, బ్రిటిషు ప్రభుత్వాన్ని తొలగించగలశక్తి మనకులేదు. కాబట్టి జపాను దండయాత్ర ప్రారంభంకాగానే వెనుకనుంచి మనంకూడా విధ్వంసక చర్యలు తీవ్రపరుస్తే బ్రిటిషుప్రభుత్వం కూలిపోతుంది, అధికారం మనచేతికి వస్తుందని వారివాదన. ఒకవేళ జపానువాళ్లు అంతటితో ఆగకుండా ముందుకువస్తే వాళ్ళ పనికూడా పడదాం అంటారు వీరు.

విధ్వంసక కార్యక్రమాల ఫలితంగా ఛిన్నాభిన్నమైపోయిన దేశాన్ని ఆక్రమించుకోకుండా జపానువారు ఆగిపోతారట - దేశభక్తులిది నమ్మాలట! ఆగిపోకుండా ముందుకువస్తే కొడతామంటారు. కాని బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించడానికి లేనిశక్తి, విజయాలతోమత్తెక్కి వస్తున్న జపాను సేనల్ని ఎదిరించడానికి ఎక్కడనుంచి వస్తుందో!

కాబట్టి, ఆ పరిస్థితులలో జరిగేది ఇదంతా కాదు. అప్పుడు జయప్రకాశ్ నారాయణముఠా అంతా తమతమ రహస్యప్రదేశాలనుంచి బయటికి వస్తారు. బోసుకు సుస్వాగతమిస్తారు. అతనితోకలిసి జపాను ఆధికారంక్రింద ఒక కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తారు.


2. జాతీయప్రభుత్వంతో దేశరక్షణ నిర్వహించడానికి కాంగ్రెసు తీర్మానించింది.

కాని, కాంగ్రెసు సోషలిస్టుల దృష్టిలో దేశరక్షణ నిర్వహించడమంటే బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని బలపరచడమే. కాబట్టి దేశరక్షణను ధ్వంసం చేయడమే స్వాతంత్ర్యానికి, జాతీయ ప్రభుత్వానికి మార్గమని వారి వైఖరి.

3. జాతీయైక్యతను నిర్మించడం కాంగ్రెసు ఆశయం. స్వయంనిర్ణయ సూత్రంవైపు కాంగ్రెసు చాలదూరం మొగ్గింది; ఏ. ఐ. సి. సి. బొంబాయి సమావేశం తరువాత గాంధీ జిన్నాను కలుసుకోవాలనుకున్నాడు; జైలులో నుంచి జిన్నాకు జాబుకూడా రాశాడు.

కాని, కాంగ్రెసు సోషలిస్టులదృష్టిలో ముస్లిం లీగంటే సామ్రాజ్యవాదుల కనుకూలమైన, అభివృద్ధినిరోధక సంస్థ. అలాంటి దానితో కాంగ్రెసుకు పొత్తు తగదు. పైగా, కాంగ్రెసు-లీగు ఐక్యత కుదరడమంటే, ప్రస్తుత ప్రతిష్టంభన అంతమవడ మన్నమాట; తమ విధ్వంసక కార్యక్రమాన్ని సాగించడానికి తగిన పరిస్థితులు లేకపోవడ మన్నమాట. అందువల్ల ఈ ఐక్యతను వారు ప్రతిఘటిస్తారు.

కామ్రేడ్



పి. సి. జోషి

మళ్ళా ప్రయత్నాలు

ఇలా అన్నివిషయాల్లోను కాంగ్రెసుకు వ్యతిరేకమైన పంథా, అవలంబిస్తున్న వీరే కాంగ్రెసు పేరుతో వ్యవహరిస్తూ వచ్చారు.

గాంధీజీ ఉత్తరాలు వీరిని బట్టబయలు చేశాయి; కాంగ్రెసువాదులతో వీరు పెట్టుకున్న సంబంధాని కొక గొడ్డలిపెట్టు పెట్టాయి' కాని సామ్రాజ్యవాదప్రభుత్వం కాంగ్రెసుపై నిషేధం తొలగించకుండా, కాంగ్రెసు నాయకుల నింకా జైళ్ళలోనే ఉంచింది. అందువల్ల కాంగ్రెసువాదులకు దైనందిన సమస్యలపై తగిన నాయకత్వం వహించి ఈ దేశద్రోహుల ఆటలను అంతమొందించడానికి ఎవరూ లేకపోయారు.

తమ పాపిష్టినోళ్ళతో మహాత్ముని పవిత్ర నామాన్ని పలుకుతూ ఈ ద్రోహులు వచ్చే ఆగస్టు 9 ని మళ్ళా రంగంలోకి రావడానికి సిద్ధపడుతున్నారు.

కాంగ్రెసు సోషలిస్టుపార్టీ రహస్యకేంద్రం "భారతజాతీయ కాంగ్రెసుకేంద్ర నాయకత్వం" అనే పేరుతో ఆగస్టు 9 కి ఈ కార్యక్రమం ప్రకటించింది.

అన్ని రాష్ట్రాలనుంచి పోగుచేసిన వేయిమంది ప్రజలతో, మహాత్ముణ్ణి ఖైదీగా వుంచినచోటికి సత్యాగ్రహ యాత్ర నడపడం—

అదే రోజున, ఆయా ప్రదేశాల నుంచి జండాలతోను, నినాదాలతోను, పూనాకు సత్యాగ్రహయాత్రలు జరిపి, పూనా చేరడమో, లేక అరెస్టు కావడమో—

ప్రజాసామాన్యం ఒకరోజు, విద్యార్థులు మూడురోజులు హర్తాలు జరపడం, మీటింగులు, ఊరేగింపులు, పతాక వందనాలు జరపడం.

ఎందుకీ కార్యక్రమం?

ఇది చాల తెలివైన ఎత్తుగడ. దీని ఉద్దేశాన్ని గ్రహిస్తే ఇందులోని పైశాచికస్వభావం బయట పడుతుంది

అసలు వీరు ఆగస్టు 9 నే ఎందుకు ఎంచుకన్నారు? ఏడాదికిందట ఆనాడుజరిగిన ఘటనలు - ప్రజల ఆవేశం - పోలీసుల లాఠీలు-తుపాకుల కాల్పులు- అరస్టులు- ఇవన్నీ ఇంకా నిన్న మొన్న జరిగినట్లే ఉన్నాయి. ఆరిపోని ఈనిప్పును మళ్ళీ రగులజేయడానికే వీరికుట్ర.

తామేర్పాటు చేస్తున్న సత్యాగ్రహయాత్రకు "గాంధీయాత్ర" అని ఎందుకు పేరుపెట్టారు? గాంధీ జాబుల్ని వీరు నిరసించారు. గాంధీజీ ఉపవాసంచేస్తున్నప్పుడు దేశమంతా ఆయన విడుదలను కోరితే వీరు, తమ కుట్రలకు భంగం కలుగుతుందని ఆవిడుదలకు వ్యతిరేకత తెలిపారు.

కాని ఇప్పుడు మహాత్ముడు వారికి కావలసి వచ్చాడు. ఎందువల్ల? కాంగ్రెసులో ప్రతివారూ ఈనాడు గాంధీజీ విడుదలకోసం ఆరాటపడుతున్నారని వీరికి తెలుసు. "పదండి గాంధీజీని విడిపిద్దాం" అని బయలుదేరక పోతే తమవెంట కాంగ్రెసు వాదులు రారని వీరు గ్రహించారు. అందుకీ "గాంధీయాత్ర"; ఈ "గాంధీయాత్ర" బయలుదేరితే గాంధీజీ ఎన్నటికీ విడుదల కాడని కూడా వీరు ఎరుగుదురు.

మునుపటిలాగా విధ్వంసక కార్యక్రమాన్నివ్వకుండా, సత్యాగ్రహ కార్యక్రమం ఇవ్వడంలో వీరి ఉద్దేశమేమిటి? ఈనాడు విధ్వంసక చర్యలకు, అరాజకానికి ప్రజలు కలిసిరారని వీరు గుర్తించారు. అందువల్లనే కాంగ్రెసు వాదులకు బాగా అలవాటయిన సత్యాగ్రహ కార్యక్రమం ఇచ్చారు. ఈ కార్యక్రమంతో ప్రజలు రంగంలోకి రాగానే, తిరిగి అరాజకానికి రెచ్చగొట్టి లాఠీలకు, కాల్పులకు దారితీయడం ఎలాగో వీరికి బాగా తెలుసు.

ఈవిధంగా, గాంధీగారిపేరు పల్లిస్తూ, సత్యాగ్రహం అని చెప్పుకొంటూ, వచ్చే ఆగస్టు 9 న మరొకసారి భారత ప్రజల్ని రక్తప్రవాహంలోముంచెత్తడానికి యీద్రోహులుకుట్రలు పన్నుతున్నారు; కాంగ్రెసు వాదులతో పోగొట్టుకున్న సంబంధాన్ని తిరిగి కుదుర్చుకోడానికి ఎత్తులు వేస్తున్నారు.

గత ఆగస్టు 9 తరువాత భారతప్రజ ఎన్నోఅవమానాలను భరించింది. వాటికి ప్రతిగా పగసాధించాలని దేశభక్తుల హృదయాలు తహతహ లాడుతూండవచ్చును. కాని పై సన్నాహాలు దేశభక్తులు పగతీర్చుకోడానికి జరుపుతున్నవి కావు. మన దేశంపైకి దుముకనున్న జపానుసేనలకు తోడ్పడాలనేఉద్దేశంతో పంచమాంగదళం జరుపుతున్న కుట్ర.

సైతాన్ బోధలు

బోసు సింగపూరు చేరుకున్నాడని బెర్లిన్ రేడియోవార్త. "భారత విముక్తిసైన్యా"నికి తనను సర్వసేనాధిపతిగ నియమించారనీ, జపాను సేనతో ఇండియాకు రానున్నాననీ బోసే ఈనెల 6వ తేదీని రేడియోలో చెప్పుకున్నాడు. తానేమో టోజో ఆశీర్వాదాలతో ఇండియాకు వస్తాడట- మన దేశభక్తులు "తిరుగుబాటు" లేవదీసి బ్రిటన్ మీద "రెండోరంగం" ప్రారంభించాలట! మాతృద్రోహి, భారత స్వాతంత్ర్య ప్రథమ విరోధి, చేస్తున్న ప్రచారం ఇది.

ఈ సైతాన్ సందేశాన్ని ఆగస్టు 9 న ఆచరణలో పెట్టజూస్తున్నారు మనదేశంలోని అతని అనుచరులు. ఇందుకు మొదటిమెట్టే ఈకార్యక్రమమంతా.

ఈపరిస్థితుల్లో మనం జలియన్‌వాలాబాగ్ దినం (జాతీయవారం) లాంటి ఇతర జాతీయ నిరసనదినాల్లాగానే ఆగస్టు 9 ని కూడా జరపాలనుకోడం చాల ప్రమాదకరం. ఈ ద్రోహులు చూపుతూన్న సత్యాగ్రహ పద్ధతులకు భ్రమసిపోవడం తెలివితక్కువపని అవుతుంది. పంచమాంగదళంవారి దేశద్రోహ పన్నాగంలో పడడమవుతుంది.

ఎదురెత్తు

కాబట్టిఆగస్టు9ని ప్రజల్ని రెచ్చగొట్టడం పంచమాంగ దళపు ఉద్దేశం-(మిగతా 3వ పేజీలో)

ప్రజాశక్తి

బుధవారం 28-7-1943

మరో ఆగస్టు 9 కి పంచమాంగదళ ప్రయత్నాలు

గత ఫిబ్రవరి ఉపవాససమయంలో ప్రకటించబడిన గాంధీజీ లేఖలు కాంగ్రెసు పాలసీని స్పష్టపరచాయి. కాంగ్రెసు మిత్రరాజ్యాల విజయాన్నే కోరుతూందని బొంబాయి తీర్మానాన్ని గాంధీజీ పునరుల్లేఖించాడు. కాంగ్రెసు యుద్ధకృషికి ఎట్టి నష్టం కలిగించదలచలేదనీ, యుద్ధకృషిని జయప్రదంగా నెరవేర్చడానికే జాతీయ ప్రభుత్వాన్ని కోరామనీ- గాంధీజీ తేటతెల్లంజేశాడు. ఆగష్టు 9 తరువాత విధ్వంసక చర్యలకు కాంగ్రెసు బాధ్యత వహించదని స్పష్టపరచాడు. గాంధీజీలేఖలు అనేకమంది దేశభక్తుల, కాంగ్రెసువాదుల భ్రమలను తొలగించాయి. పంచమాంగదళంవారిచే రెచ్చగొట్టబడుతున్న విధ్వంసక చర్యలు కాంగ్రెసు కార్యక్రమం కాదని గుర్తించునట్లు చేశాయి.

పంచమాంగదళంవారి అరాచక కార్యక్రమాన్ని ఆంధ్రదేశంలో సాగించుతున్న ఫార్వర్డుబ్లాకు, కాంగ్రెసు సోషలిష్టులు, రంగాముఠావారు ప్రజలకు, దేశభక్తులకు దూరమయ్యారు. జైలు బయటనున్న కాంగ్రెసు నాయకులు, యీ మధ్యవిడుదలైన కాంగ్రెసునాయకులు, కాంగ్రెసు పేరున ప్రకటించబడుతూ విధ్వంసకచర్యలను ప్రోత్సహించుతున్న రహస్యకరపత్రాలను, అవి కాంగ్రెసు ప్రతిష్ఠను దుర్వినియోగం చేస్తున్నాయని ఏవగించుకొన్నారు. అట్టికరపత్రాలతో కాంగ్రెసు సంస్థకు ఎట్టిసంబంధం లేదని స్పష్టపరచారు.

కాని పంచమాంగదళం తనపనిని మానలేదు. క్రిందటి వారంలో ప్రకటించబడిన 'రణగర్జన' అనే రహస్య కరపత్రం (1 వ సంపుటం 3 వ సంచిక) ఆగష్టు తొమ్మిదిన వార్షికోత్సవం జరపడానికి విధ్వంసక కార్యక్రమాన్ని యిచ్చింది. విచిత్రమేమిటంటే, జపాన్ ఏజెంట్లు ఈ కరపత్రాన్ని ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు పేరుతో ప్రకటించారు. వీరి కార్యక్రమంలో ప్రధానహంశాలు (1) సమ్మెలు (2) రైలు, టెలిఫోను, టెలిగ్రాఫ్, రోడ్డులు మొదలగునవి ధ్వంసంచేయుట (3) పన్నులు ఎగవేయుట. ఇదిపూర్తిగా అరాజక కార్యక్రమం. జపాన్ దుండగీడులకు సాయపడేవారు యిచ్చే కార్యక్రమం. కాంగ్రెసు మహాసభకు, గాంధీజీకి, బొంబాయి తీర్మానానికి కూడ దీనితో ఎట్టిసంబంధంలేదు. ఫిబ్రవరిలో ప్రకటించబడిన లేఖలలో గాంధీజీ ఆ సంగతి స్పష్టపరచాడు. కాని ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు పేరుతో యిలాంటి కరపత్రాన్ని ప్రకటించిన జపాన్ ఏజంట్లు ప్రజలను, దేశభక్తులను మోసపుచ్చ చూస్తున్నారు.

ఈ పంచమాంగదళ కుట్రలో, దేశభక్తులు పడరని, ప్రజలు దేశరక్షణకు యుద్ధకృషికి నష్టం కలిగించే యీ విధ్వంసక కార్యాలలో పాల్గొనరనీ మాకు విశ్వాసముంది. కాని దేశభక్తులు,బయటవున్న కాంగ్రెసు నాయకులు యీసందర్భంలో తమ కర్తవ్యాన్ని నెరవేర్చాలి. రంగాముఠా, కాంగ్రెసు సోషలిస్టులు, ఫార్వర్డుబ్లాకువారు పంచమాంగదళ కార్యక్రమాన్ని యిచ్చే కరపత్రాలను కాంగ్రెసు పేరుతో ప్రకటించి, కాంగ్రెసు మహాసభ పేరును, సాంప్రదాయాలను కలుషితం చేస్తున్నారు. బ్రిటీషు సామ్రాజ్యవాదులు ఫాసిస్టులకు కాంగ్రెసు అనుకూలమని ప్రపంచప్రజల కండ్లుగప్పడానికి చేసే ప్రయత్నాలకు యీ దేశద్రోహులు సాక్ష్యాలు సమకూర్చుతున్నారు. ఈ మోసాన్ని బట్టబయలుచేయడానికి బయటవున్న కాంగ్రెసునాయకులు పూనుకోవాలి. తమకు సంబంధంలేదని చేతులు ముడుచుక్కూచుంటే యీ మోసం కాంగ్రెసు పేరున కొనసాగుతుంది. కాబట్టి దేశభక్తులకు మా వినతి ఏమంటే, దేశద్రోహులగు యీ జపాన్ ఏజెంట్లను బహిరంగంగా ఎదుర్కోండి. ఈ ఫోర్జరీ కరపత్రాలతో కాంగ్రెసుకు ఏమీ సంబంధంలేదని ప్రకటించండి. ఈ ద్రోహాన్ని బట్టబయలు చేయడానికి, కాంగ్రెసు ప్రతిష్ఠను కాపాడటానికి, గాంధీజీ గౌరవం నిలబెట్టడానికి, పూనుకోండి.

ఆంధ్ర ప్రజలకు మా విన్నపమేమంటే, గత సంవత్సరపు అనుభవంద్వారా విధ్వంసక చర్యలు కాంగ్రెసు కార్యక్రమం కాదని మీరు తెలిసికొన్నారు. అవి దేశరక్షణకు, స్వాతంత్ర్యోద్యమానికి వ్యతిరేకమనీ, జపాన్ దుండగీడులకు అనుకూలమనీ మీరు గుర్తించారు. అరాచకకార్యక్రమంతో మీ వద్దకువచ్చే జపాన్ ఏజెంట్లను తరుమండి. దేశద్రోహులకు ప్రజలలో తావులేదని రుజువుచేయండి.

విద్యార్థి జీతాల పెంపుదల

అసలే విద్యార్థు లిచ్చుకోవలసిన ఎక్కువ జీతాలతో తల్లిదండ్రుల జీవితభారం నానాటికి విషమిస్తూంటే, విశాఖ - గుంటూరు జిల్లాబోర్డు అధికారులు విద్యార్థుల వద్ద ఈయేడు అదనంగా మరొకనెల జీతం వసూలుచేయ నిశ్చయించారు. గుంటూరు జిల్లాలో స్కాలర్‌షిప్పులు,అర్ధస్కాలర్‌షిప్పులు,కూడా రద్దుచేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ చర్య విద్యావ్యాప్తిని అరికట్టుతుంది. కాబట్టి, విద్యార్థులు—తల్లిదండ్రులు యీ నిర్ణయాన్ని ఉపసంహరించుకొనేటట్లు ఆందోళన చేయవలసిందిగా విశాఖపట్నం జిల్లా విద్యార్థిసంఘ ఆర్గనైజరు, గుంటూరుజిల్లా విద్యార్థిసంఘ కార్యదర్శి, విజ్ఞప్తులు చేస్తున్నారు.

★ మన రాజకీయాలు

దేశంలో కరవుకు కలరాతోడయింది!

కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ

దేశంలో ఆహార సమస్య యిదివరకెన్నడూ దాల్చని భీషణరూపం దాల్చింది. మలబారులో ప్రజలు సరియైన తిండిలేక, కలరాకు ఆహుతి అవుతున్నారు. ప్రభుత్వం యిచ్చిన లెక్కల ప్రకారమే, జులై 17 వ తేదీ నాటికి కలరావల్ల మలబారులో చనిపోయిన వారిసంఖ్య 2,979 (మునిసిపాలిటీలున్న పట్టణాలు మినహాయించి). ఒక్క కాలికట్ పట్టణంలోనే జులై 20 నాటికి 1,272 గురు మృత్యువువాతపడ్డారు. రాష్ట్రం మొత్తంమీద యీ జాడ్యానికి బలిఅయినవారి సంఖ్య 5,000 దాటుతుంది. 100 కి 85, 90 రేటు చొప్పున రోగులు మరణిస్తున్నారంటే, ప్రజలెంత బలహీనులై ఉండియుండాలో ఊహించుకోవచ్చు.

ఆంధ్రరాష్ట్రంలోకూడా

మన ఆంధ్రరాష్ట్రంలోకూడా యీజాడ్యం వందలాది ప్రజల్ని కడుపున పెట్టుకొంటూంది. విజయనగరంలో 16 వ తేదీ వార్తప్రకారం, 24 గురికి కలరావచ్చి, 10 మంది చనిపోయారు. కర్నూలుజిల్లాలో, కంభం—కర్నూలు తాలూకాల గ్రామాలలో 17 వ తేదీ నాటికి 70 మంది చనిపోయారు. దాదాపు 2 లక్షలమంది కరువు జనసంఖ్య ఉన్న బళ్లారి జిల్లాలో పరిస్థితులు మరీఘోరంగా ఉన్నాయి. కరువుపనులలో పనిచేసేవారికి, ధాన్యంసప్లయి లేక, నగదు కూలి యిస్తున్నారు. వారు ఎక్కణ్ణుంచి ధాన్యంగాని, జొన్నలుగాని, తెచ్చుకుంటారు? కలరా అక్కడకూడా ప్రవేశించింది. అందువల్ల, కురుగోడులో ఉన్న క్షామ వంటశాలను మూసివేశారు! కృష్ణాజిల్లాలో దివి తాలూకావంటి తాలూకాలోకూడా కలరా ప్రవేశించిందంటే, దేశానికి ముందుముందు ఎలాంటి గతి పట్టనున్నదో ఊహించ శక్యం కాదు.

బెంగాల్‌లో నౌఖాలీ జిల్లాయందలి అర్జుంతలా యూనియన్‌లో ఒక కొత్తరకపు వ్యాధి బయల్దేరింది. తగిలిన 4 లేక 5 గంటలలో అనేకమంది మనుష్యులు, పశువులు చచ్చిపోయారు.

ప్రభుత్వ ప్రకటనలు, అంకెలు

ఆహారసమస్య నేడెంత విషమరూపం దాల్చిందో ప్రభుత్వం సహితం గుర్తిస్తోంది. పాట్నాలో సర్‌సుల్తాన్ అహమ్మద్ ఉపన్యసిస్తూ, దేశం అంతటా దొంగవ్యాపారం సర్వవ్యాపితం అయిందనీ, నిలవచేసే వర్తకుల్ని ప్రజలు బహిరంగపరుస్తూ, వారి వ్యాపారాన్ని కొనసాగకుండా చేయడానికి ప్రభుత్వం, ప్రజలు అన్యోన్యంగా ఒకరిపైఒకరు ఒత్తిడి తీసుకు రావలసి యుంటుందని హెచ్చరించాడు. మొన్న 23 వ తేదీ ప్రభుత్వ ప్రకటన ప్రకారం, దేశంలో బియ్యపు పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంవల్ల విదేశాలకు ఎగుమతి చేయడం ఆపుజేయబడింది. దేశంమొత్తం మీద ధరల పెరుగుదల యెలాఉందో చూపడానికి ప్రభుత్వం కొన్ని ఇండెక్సు నెంబర్లు ప్రకటించింది. వాటిప్రకారం, యుద్ధానికి పూర్వం ఆహార పదార్థాల ధరలు 100 అయితే జులై 10 వ తేదీనాటికి (1943) 293 ఉంది.

మద్రాసు రేషనింగ్ ఆర్డరు

మద్రాసు ప్రభుత్వం, రోజురోజుకూ విషమిస్తూన్న ఆహారసమస్యను పరిష్కరించడానికి 'మద్రాసు రేషనింగ్ ఆర్డరు' ఒకటి జారీ చేసింది. దాని ప్రకారం లైసెన్సుపొందిన వర్తకులు తప్ప మిగతావారెవరూ సరుకును అమ్మకూడదు. లైసెన్సు పొందిన టోకు వ్యాపారస్థులు లైసెన్సు పొందిన చిల్లర వర్తకులకు మాత్రమే సరుకును అమ్మాలి. చిల్లర వర్తకులు గృహకృత్యాలకు మాత్రమే సరుకు అమ్మాలి. ఒక్కొక్కరు ఎంతెంత సరుకును కొనుక్కోవచ్చునో, సూచించే రేషన్‌కార్డులు పంచిపెట్టబడతాయి. ఈ ఆర్డరును అమలు పరచే నిమిత్తం నియమించబడు ఏ ఉద్యోగి అయినా తన కనుమానంఉన్న యిండ్లలోగాని, ఆవరణలోగాని, ప్రవేశించి, యెవరినైనా ప్రశ్నించవచ్చు. ఆ ప్రశ్నలకు నిజాయితీగా జవాబివ్వాలి. ఈ ఆర్డరు ఎప్పుడమలులోకి వస్తుందో ప్రభుత్వం తెలియపరచలేదు. గెజెట్‌లో ప్రకటించబడే తేదీనుండి అమలు పరచబడుతుందని మాత్రం తెలియజేశారు. అయితే, దేశంలో పరిస్థితులు విషమించుతున్న కొద్దీ ఆలస్యం విషతుల్యం. వెంటనే యీ ఆర్డరును ప్రతిచోట, కనీసం ప్రతిపట్టణంలోను, అమలు పరచాలని ప్రజాసంస్థలు, ప్రముఖ వ్యక్తులు ఆందోళన చేయాలి. ప్రజాప్రతినిధులతో గూడిన ఆహార కమిటీల సహాయాన్ని స్థానికాధికారులుకూడా తీసుకోవాలి. అప్పుడే రేషనింగ్ ఆర్డరు సక్రమంగా అమలు జరుగుతుంది.

బట్టల సమస్య :
మిల్లుయజమానుల కుట్ర

తిండి తరవాత మనిషికి కావలసింది బట్ట. ఇండియాప్రభుత్వం బట్టలకంట్రోలు స్కీమును ప్రకటించి సుమారు నెలరోజు లయింది. అయినా, చౌకబట్ట మార్కెట్టులో దొరకడం లేదు. కారణం ఏమో పరిశీలిద్దాం.

మిల్లు యజమానులు, వర్తకులు కలసి కంట్రోలు బోర్డును స్వాధీనం చేసుకుంటే, ప్రభుత్వస్కీమును చక్కగా భగ్నం చేయవచ్చునని భావించారు ప్రభుత్వం ఎలాంటి దృక్పథంలో ఉందంటే, ప్రజలన్నా-కార్మికులన్నా దానికి బెదురు. ఇక యీ స్కీము అమలు జరిగేది మిల్లు యజమానులు - వర్తకులు సహాయంచేస్తేనే. ఈవిధంగా కంట్రోల్ బోర్డులో ఉన్న 25 సీట్లలో 15 సీట్లు బట్టల వ్యాపారస్థులకిచ్చారు 2 సీట్లు ప్రత్తి వ్యాపారస్థుల కొచ్చాయి. ఒకేఒక సీటు కార్మిక ప్రతినిధికొచ్చింది! చౌక బట్టను కొనే 40 కోట్లమంది ప్రజాసామాన్యానికి ఒక్క సీటు అయినా లేదు. మిల్లు యజమాన్లు ఇంతటితో ఊరుకున్నారా? బట్టల ఉత్పత్తిని గురించి, ధరల నిర్ణయాన్ని గురించి, తీర్మానించే సబ్ కమిటీనికూడా వీరే స్వాధీనం చేసుకున్నారు. ఇంతే కాదు. ప్రభుత్వ స్కీముప్రకారం 100 కి 50 మిల్లులలో చౌకబట్ట ఉత్పత్తి చేయబడాలి. కాని యజమానులు కోరే లాభాలు చౌకబట్ట ఉత్పత్తివల్ల రావు. కనుక మిల్లుల్ని మూసివేయడానికే తయారయారు. కార్మికుల్ని సమ్మెలకు రెచ్చగొట్టారు. కాని యీవలలో కార్మికులు పడలేదు. ఇంతలో మిల్లు యజమానులు మరోయెత్తువేశారు. ప్రతి బట్టమీద దాని ఖరీదును ముద్రించవలసి యుంటే, అలా ముద్రించడానికి నిరాకరించారు. పైగా, కంట్రోల్ బోర్డుకు అధ్యక్షతవహించిన మిల్లు యజమాని యీమధ్య ఉపన్యసిస్తూ, బట్టల ధర క్రమంగా తగ్గుతోంది కాబట్టి ధరల్ని కంట్రోలుచేయడమే అనవసరం అని వాదించాడు! మిల్లు యజమానులకు టోకు వ్యాపారస్థులతోడై, 3 నెలల గడువును పొడిగించవలసిందని మహజర్లు, టెలిగ్రాములు కురిపిస్తున్నారు. ప్రభుత్వం నిరాకరించింది. కానివీరి ఆందోళన ఎక్కువౌతోంది గాని తగ్గడంలేదు.

ప్రభుత్వం దేశంలో ఏర్పడిన బట్టల కరవును గుర్తించి, వెంటనే ఉపేక్ష వదలి యీ క్రింది పనులు చేయాలి :

1. కంట్రోల్‌బోర్డులో కార్మికులకూ—ప్రజాసామాన్యానికి తగినంత ప్రాతినిధ్యం ఈయాలి.

2. ధరల కంట్రోలును గురించి, ఉత్పత్తిని గురించి, నిర్ణయాలు (మిగతా 7 వ పేజీలో)

★ చిన్నకథ

గుణపాఠం

తుమ్మల వెంకటరామయ్య

"ఏమండీ! మీ ఆవిడ ఎక్కడికీ రాదేం" అని ప్రశ్నించారు పొరుగూరు మహిళాసంఘం వారు.

"ఆఁ రాదులెండి — రాదులెండి" నవ్వేశాడు రఘురామయ్య.

"పత్రికలూ— పుస్తకాలల్లా - జాగ్రత్తగా చదువుతున్నావా? మీ కామ్రేడ్‌లో ఏమీ మార్పున్నట్టులేదు. ఆమె కదిలేటట్లు చేయాలి కాస్త" అని సూచించాడు సెక్రటరీ.

"చేయాలి! చేయాలి!!" అని నసిగాడు రఘురామయ్య.

"నువ్వు స్వరాజ్యంలో తిరుగుతున్నావుగా! నీ పెళ్ళాన్నికూడ వెంటేసుక తిప్పు" అని వెక్కిరించింది ముసలమ్మ.

"ఏం తిప్పక! తిప్పుతాం." అని దబాయించాడు రఘురామయ్య.

* * *

రఘురామయ్యకు తీరికతక్కువ. రైతుల్లో, కూలీలలో, కాంగ్రెసువాదులలో ఎడతెగని ప్రచారం జేస్తున్నాడు. ఎప్పుడైనా కాస్త తీరిక దొరికినా, భార్యసంగతి అట్టే పట్టేదికాదు. కాస్త బుర్ర వేడెక్కితే, కూతురువద్దనున్న అమ్మను చూడబోయేవాడు. ఇంట్లోఉన్నా అతని ధోరణి విచిత్రంగా ఉండేది. భార్య చొరవచేసికొని నవ్విస్తే నవ్వేవాడు. మాట్లాడిస్తే మాట్లాడేవాడు. (పోట్లాడితేమాత్రం పోట్లాడేవాడు కాడు.) రబ్బరుబంతికి కీ ఇస్తే బర్రున పరుగెత్తుతుంది. రఘురామయ్యకు భార్యా చొరవవుంటే, మాటా మంతీ - కేళాకోళాలూ వుండేవి. వచ్చేపొయ్యే వారికి వడ్డించి పెట్టడమే గాని, రఘురామయ్య భార్యకు, బయటిప్రపంచం పుత్త అంధకారం. రాత్రింబవళ్ళు నిద్రాహారాలు మాని పనిచెయ్యడమే గాని, భార్యకు చైతన్యం గల్గించాలి అనేదే అతనికి తోచదు. తోచినా ఎలాగా అని, పెద్దసమస్య ఎదుర్కొనేది.

* * *

రఘురామయ్య నిరుటిలాగాగాక, ఈ సారి ముందే మేల్కొన్నాడు.

గతసంవత్సరం రైతులు, కూలీలకు ఎక్కువ కూలీ యిమ్మంటే ఠాట్ అన్నారు.

పన్నెండు గంటలకీ, వంటిగంటకూ చేలో ప్రవేశించకుండా, పెందలకడే వచ్చి, నికరంగా ఏడు గంటలపని చేయండర్రా అంటే, ఠాట్ అన్నారు కూలీలు.

ఈసారి ఇంటింటికీ తిరిగి, యుద్ధం తిండి కరువు- బట్టల కరువు- కిరసనాయిల్‌కరువు- మొదలైనవన్నీ కూలీల కెంత ఇబ్బంది కలుగ చేస్తున్నాయో చెప్పాడు. విపరీత ధరల మూలాన కూలీజీవితం ఎంతదుర్భరమో బోధించాడు. పెద్దలనందరినీ ప్రోగుచేసి, చర్చించాడు. కూలీలు నికరంగా, 7 గంటలు పని చేసేటట్లు, బస్తాధర ఎన్నిరూపాయలమ్మితే అన్ని అణాలు రైతులిచ్చేటట్లు ఒప్పించాడు.

అటు కూలీలలోకూడా ప్రచారంచేశాడు. కూలీలను పిల్పించి మీటింగులు పెట్టాడు. నికరంగా 7 గంటలు పనిచేసి ఎక్కువ కూలీ తీసుకోడం ఎలా లాభమో వివరించాడు. ఇంకా రైతు కూలీల సామరస్యంవల్ల లాభాలేమిటో బోధించాడు.

"సరే రేపట్నించి ఆలాగే వస్తాం" అన్నారు కూలీలు.

* * *

రఘురామయ్యకు ఆరాత్రి బాగా నిద్దర పట్టింది. ఒక సమస్య పరిష్కారమయింది. పొద్దున్నే లేచి కాఫీత్రాగి గూడెం బయలు దేరాడు.

రఘురామయ్య ఆలోచనలో పడ్డాడు. రైతుల ఇళ్ళల్లో ఎంతెంత ధాన్యంవుంది? కుటుంబానికి, అవసరఖర్చులకీ ఎంతవసరం? ఇంకా ఎంత మిగులుతుంది? ఎంత తగులుతుంది? ఊరి ఉమ్మడిమీద ధాన్యం ఎంత కావాలి? కూలీలకు ఎంతెంత జీతాలు క్రింద వస్తుంది? ఎంతబాకీలక్రింద పోతుంది? ఎన్నాళ్ళు కూలీ దొరుకుతుంది? ఎన్నాళ్ళు కరువు? కరువు కాలంలో ఎంతధాన్యం కావాలిసి వస్తుంది. ఉమ్మడి ధాన్యంనిలవ చేయడానికి ఎవరెవరిని అడగాలి? ఆహారకమిటీలో ఎవరెవరుంటే బాగుంటుంది?

"ఏంరా అబ్బాయి!" అన్నమాటలు రఘురామయ్యని మళ్ళీ ఈ ప్రపంచంలోకి లాక్కొచ్చాయి. "మరివేళవుతోంది. అంతా నీవేనది పావు. మేంవెళితే మళ్ళా ఏమైనా తర్జనభర్జనలు రావచ్చు. నువ్వేవెళ్ళి కూలీలను కాస్తతెగ్గొట్టు. అప్పుడే పదవుతోంది." అన్నాడు ఒక రైతు.

'సరేలే' అంటూ బయలుదేరాడు రఘురామయ్య.

"ఏం దొరో!" వెంకడెదురుపడ్డాడు.

"మళ్ళా చెడిందిదొరా"

"ఏం?"

"కూసెంత అబ్బెంతరం వచ్చిపడింది."

"ఏంటది?"

"అసలు ఒకళ్ళ కొకళ్ళకి కలిసి చస్తుందండీ మీరు శమపడటంగాని."

"అసలు విషయం తేల్చుదూ."

"ఆడంగులు వినడంలేదండి, ఎవరన్నా ఆ ఆడసంగంవారొచ్చినా బాగుండును."

"వాళ్ళుచెప్పే అభ్యంతరం ఏమిటిముందు."

"ఏమండీ! మన దొరసానిగారాసంగంలో లేరటండి. ఆమెనన్నా పంపి చెప్పించండి దొరా!"

"నీధోరణి నీదేగాని, అసలుసంగతి చెప్పవు."

"అదిగో లక్ష్మివత్తోంది. దాన్నే అడగండి."

* * *

లక్ష్మి వచ్చి నిలబడింది. రఘురామయ్య "ఎందుకనే, పెందలకడ రామన్నారట" అని ప్రశ్నించాడు. "ఎట్టారామండీ! వీళ్ళకేం మాటలు చెపుతారు. ఈకాడది తీసి ఆకాడ పెట్టరు. కూడొండీ, గుడ్డలుతికి, పిల్లాజెల్లా మూతులూ ముడ్లూ కడగడమేగాకండా, యీళ్ళ కొత్తులొత్తాలాయె. ఈపితోమడందగ్గర్నించే మేమైతే, ఎట్టాగండి వచ్చేది? ఎప్పుడు లెగమంటారండి. మేంరాలేందొరా, ఏమన్నా అనండి." ఉపన్యాసంలాగ దంచేశింది లక్ష్మి.

వెంకడు కిక్కురుమనకుండా పోయాడు. రఘురామయ్య తనదారితాను పట్టాడు. పాత పద్ధతినే పనీ, కూలీ, సాగిపోయింది. తాను సూచించిన కార్యక్రమం భగ్నమయింది. ఆ రోజు రాత్రి రఘురామయ్య "ఆడసంగంవారు వచ్చినా బావుండును" అని పలవరించడం భార్యావింది.

ఆకలి! ఆకలి! దాహం! దాహం!

కొమఱ్ఱాజు వినాయకరావు

"ఆకలి" వాకిలి
కద్దు నిలచీ,
హాహాకారం చేసింది!
శోకాకారం దాల్చింది!

* * *

నిలబడు పేదది
నిలబడినట్లే
నిల్వున నీరై కారింది!
నేలకు శోషతొ వారిగింది!

* * *

మూసినద్వారం తీసిధనాఢ్యుడు
మొహాన యుమిసీ పొమ్మనెనూ!
తీసిన ఘడియను వేసె మదాంధుడు
తిట్లయక్షతల దీవించె

* * *

ఆకాశంలో విమానదాడుల
హఠాన్నినాదాల్ మ్రోగినవి!
శ్రీవణవిదారక ఘుంకారంతో
శత్రువిమానా లరుదెంచి,

శ్యామమేఘముల చాటునపొంచి
శాంతికి భంగంబొనగూర్చి,
మిద్దెలు మేడలు దగ్ధమొనర్చి
మృత్యువు ప్రణవం విరజల్లె!

* * *

దాచినధాన్యం, దోచిన ధనమూ
దగ్గంకాగా తప్పుకొనీ,
పారిణాల్ విడికిట పట్టుకొనీ,
పణవ్యాపారి బయటపడెన్

* * *

అరుణ శంఖులా, అరణ్యరోదన,
ఆర్తనాదం భయంకరం!
ఆకలి, ఆకలి, దాహం, దాహం!
ఆర్చే తీర్చే అమ్మేదీ?

* * *

బిచ్చకత్తియను పిలిచెజాలిగా
బిచ్చము పెట్టని బేహారి!
ముదుసలి ముష్టిది ముద్దపెట్టెనోయ్
మొహాన యుమిసిన మూర్ఖునకూ!

—★—

★ కరువు క్యాంపులలో

అనంతపురం జిల్లా ఉరవకొండ టౌను చుట్టుప్రక్కల ప్రభుత్వంచే తెరువబడ్డ 8 కరువు క్యాంపులున్నాయి. వాటిల్లో సుమారు 32000 మంది ప్రజలు రాళ్లు పగలగొట్టడం, రోడ్లు వేయడం పనులను చేస్తున్నారు. ఈమధ్య కొంతకాలం ప్రభుత్వమే ఈకూలీలకు ధాన్యం అమ్మిస్తూ ఉండేదికాని, జూలై 11 వ తేదీ నుండి ఈక్యాంపులలో ఎక్కడా గింజలు దొరకడంలేదు. క్యాంపులో ఉండే ఛార్జి ఆఫీసర్లనడిగితే సప్లయికావంటారు. మరమరాలు (బొరుగులు) సేరు 1 కి 0-5-6, అలచందులు (బొబ్బర్లు) సేరు 1 కి 0-12-0 చొప్పున అమ్ముతుంటే, కూలిడబ్బులు మిగుల్చుకున్న కొద్దిమంది కూలీలు మాత్రం వాటిని కొనుక్కొని తింటున్నారు. ఇతరులు దేవదారాకులను తవుడుతో కలిపి, వండుకు తింటున్నారు.

ఈ పరిస్థితులనుగూర్చి అధికారులకు విన్నవించుటకై ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ వలంటీర్లు తాతినేని వెంకటేశ్వరరావు, బాబారాములు గార్లు, హరిజన హాస్టలు మేనేజరు చందా నారాయణప్పగారు హోలియారు, చాబాల, ఉరవకొండ, కొట్టాలపల్లిక్యాంపులలోని 10000మంది కూలీలతో స్థానిక మేజస్ట్రీటు వద్దకు డిప్యుటేషనువెళ్ళి, ధాన్యం దొరకని స్థితినిగూర్చి తెలియజేశారు. కాని, ఆ ఉద్యోగి ఇదేమీ పట్టించుకోలేదు. ఆమేజస్ట్రీటు బదిలీకాగనే, క్రొత్తమేజస్ట్రీటు వద్దకు మరల రాయబారం తీసుకు వెళ్ళగా, వారు షాహుకార్లకుండి 300 బస్తాల ధాన్యాన్ని స్వాధీనపర్చుకొని తన ఆఫీసులోపెట్టి అమ్ముటకు ప్రయత్నించారు. కాని, గుంపులనుసర్దలేక, వాటిపైబడి కొట్టుట మాత్రం జరిగింది. ఆరాత్రి రైతుసంఘం వలంటీర్లు, హరిజన హాస్టలు మేనేజరు మేజిస్ట్రేటును కలుసుకొని, తాము ప్రజలను సర్దుతామని, ధాన్యాన్ని అమ్మించ వలసిందని కోరారు. అందుకు మేజస్ట్రీటు అంగీకరించాడు. మరునాడు కూలీలనందరనూ వరుసగా కూర్చోబెట్టి, సుమారు 5000 మందికి ధాన్యం అందజేయించారు ఈవలంటీర్లు. మేజస్ట్రీటు కూడా ఉదయంనుండి రాత్రివరకూ స్వయంగా వుండి వలంటీర్లకు సహాయంచేస్తూ ధాన్యాన్ని అమ్మించారు. అప్పటినుండీ వలంటీర్లు ఆఫీసు వద్ద నిలబడి, గుంపులను సర్దుతూ, ఏవిధమైన అలజడీలేకుండా ధాన్యాన్ని అమ్మిస్తున్నారు.

తిండి గింజలు దొరకకపోవటంబాటుతో కూలీల కనేకకష్టాలు వున్నాయి. మేస్త్రీలు అనేక మోసాలు చేస్తున్నారు. గ్యాంగులో ఉండే 100 మంది కూలీలు చేసినపనిని 125 మంది వరకూ చేసినట్లు మస్తరువేసి, కూలీలకు నిర్ణీతపు పని ప్రకారం రావలసిన కూలిని మినహాయించి తాము కాజేస్తున్నారు. ఒక దినం చాబాలక్యాంపులో 830 మంది కూలీలకు 1230 కూలీలు వచ్చినట్లు మస్తరు వేయబడియుంది. శెలవదినంఅలవెన్సును 500 మందిది తీసుకొని 100 గురకే పంచుతారు. ఈవిధంగా ఉరవకొండ క్యాంపులో గత శలవు దినమున కాజేయబడ్డ మొత్తం రు 68-12-0. కూలీలకు మంచినీళ్ళ వసతులులేవు. కాబట్టి గాంగులలో కొంతమందిని దగ్గర గ్రామాలకు పంపి నీళ్ళు తెప్పించుతారు. కాని నీళ్ళకు వెళ్ళిన కాలానికి కూలి విరగగోస్తున్నారు! పిల్లలకు చెట్లనీడలో పడుకోబెట్టుటకు వెళ్ళనందుకు స్త్రీలకు జీతాలు విరగగోస్తున్నారు. ఇట్టి అన్యాయముల నరికట్టుటకూ, కూలీలకు సరిగా కూలి, గింజలు ముట్టునట్లు చూచుటకూ రైతుసంఘం వర్కర్లు, స్థానికకాంగ్రెసు వాదులూ కృషిజేస్తున్నారు. (మా విలేఖరి.)

(1 వ పేజీ తరువాయి) కాని, దేశభక్తుల కర్తవ్యం శాంతిని కాపాడడమే!

ఈ ఆగస్టు 9 న పంచమాంగదళానిదే పైచేయి అయినట్లయితే నిరుడు అనుభవించిన దానికన్నా దారుణమైన నరకం అనుభవిస్తాం. ఇప్పటికన్నా కాంగ్రెసు దేశభక్తులు ఇంకా ఎంతో నిస్పృహపాలవుతారు - జపాను సేనల్ని మన పైకి పంపమని బోసు తనయజమానుల్ని ప్రోత్సహిస్తాడు.

అలాకాకుండా, దేశభక్తులే నెగ్గి శాంతిని కాపాడినట్లయితే - పోలీసులు ఎక్కడివారక్కడ ఆగిపోతారు - పంచమాంగ దళం చప్పబడిపోతుంది - 'ఇదికాదురా సమయం' అని బోసు ఆగుతాడు. అడ్డంకుల నన్నిటిని ఎదుర్కొని, దేశంలోని ప్రతిష్టంభన తొలగించి గాంధీజీని విడిపించి, కాంగ్రెసు - లీగు పొత్తు కుదిర్చి, జాతీయప్రభుత్వం స్థాపించి, బర్మా, మలయాల్లో విజయయాత్ర ప్రారంభించడానికి వ్యవధి చిక్కుతుంది.

ఇప్పుడు కాంగ్రెసు దేశభక్తులే తేల్చాలి. పంచమాంగ దళాన్ని, ఇంకా పెడతోవ తొక్కిన దేశభక్తులుగానే ఎంచి, కాంగ్రెసు వాదుల్ని వారిచేతికప్పగించి మరొక ప్రళయంలోకి దించుతారా-లేక నిస్తబ్ధతను వదలి, చైతన్యం కనబరచి, పరిస్థితులు చెయిజారిపోకముందే పంచమాంగ దళ పన్నాగాన్ని గురించి ప్రజల్ని హెచ్చరించి, దేశభక్తులనుంచి దేశద్రోహుల్ని వేరుచేసి, దేశాన్ని కాపాడుతారా!

★ జీవితావసరాల సమస్య విషమిస్తూంది

ఆహారపదార్థాల కరువు మెల్లమెల్లగా కొత్త ప్రదేశాలకు వ్యాపిస్తూంది: ఉన్న ప్రదేశాల్లో మరింత తీవ్రమవుతూంది. పశ్చిమగోదావరిలో వచ్చే నెలలోనో, ఆపై నెలలోనో కరువు ప్రారంభ మవుతుందని అనుకుంటున్నారు. ఆజిల్లాలోని పాలకొల్లులో ఈ మధ్య అన్నం దొంగతనం జరిగింది. ఒక ఇంటివారు ఇద్దరికి వడ్డించుకొని ఊరగాయ తెచ్చుకోడానికి వెళ్ళి వచ్చేలోగా అన్నం మాయమయింది. ఎవడో అన్నార్తుడు ఆ అన్నం మూటకట్టుకొని, గిన్నెలను దొడ్డిలోవిడిచిపెట్టిపోయాడు. ఇంటిలో ఉన్న ఇతర విలువగల సరకులను వేటినిముట్టలేదు.

ఇలాంటి పరిస్థితులు జిల్లాలో సర్వసాధారణంకాకముందే ప్రజలు జాగ్రత్తపడాలి. అన్ని ప్రాంతాల్లోను ఆహారకమిటీలుస్థాపించి, కుటుంబాల లెక్కలను తీసుకొని, ఆహార పదార్థాల నిలవను, పంపకాన్ని ఏర్పాటుచేసుకోవాలి.

విశాఖపట్నంజిల్లా ఇదివరకే కరువుబాధకు గురి అయింది. కొన్ని ప్రాంతాల్లో ప్రకాసం స్థల, అధికారుల ఐక్యకృషిఫలితంగా కరువు బాధలను కొంతవరకయినా నివారించడానికి తగు ఏర్పాటులు జరిగాయి. కాని చాలినంత స్టాకు లేక పోవడంవల్ల కరువు నానాటికి తీవ్రమయ్యే పరిస్థితు లేర్పడుతున్నాయి.

అనకాపల్లి తాలూకా ఏనాడు రెండవ రాయలసీమ అవుతుందా అన్నట్లుందని వార్త. ఆ తాలూకాలో 152 గ్రామాలున్నాయి; జనసంఖ్య సుమారు 2,20,000. ఈ తాలూకాకుప్రభుత్వం నెలకు 5000 బస్తాలు సప్లయి చేస్తూంది. కాని, కనీసం నెలకి 30,000 బస్తాలన్నా కావాలి. ఈ తక్కువ సప్లయికి తోడు అవకతవకల పంపకం ఒకటి. ఒక్క అనకాపల్లి పట్టణానికే 4000 బస్తాలిస్తున్నారు. మరి 4, 5 వందల బస్తాలు కరువు నివారణ పనుల వద్దకు పంపుతున్నారు. మిగిలిన 500, మిగిలిన గ్రామాలన్నింటికీసంపుతున్నారు. ఇకఅక్కడి ప్రజలస్థితివేరే చెప్పనక్కరలేదు.ఇతగ్రామంలో ధాన్యం నిలవవున్నవారు దానిని దాచేస్తున్నారు. వీటన్నిటివల్ల తాలూకాలో తీవ్రమయిన అశాంతి పెరుగుతోంది. రహస్య పాతర్లలోఉన్న ఈ ధాన్యాన్ని ప్రజాసంస్థల సహాయంతో బయటికి తెచ్చి ప్రజలకు పంచిపెట్టడానికి ప్రభుత్వం వెంటనే పూనుకోవాలి. అంతేకాకుండా తాలూకాకు ఇప్పుడిస్తున్న సప్లయిని ప్రజల అవసరానికి సరిపోయేలా హెచ్చించాలి.

అవకతవకల్ని అరికట్టాలి

ఇంతేకాదు. ప్రజాసంస్థల సహకారంతో చేసిన ఏర్పాటులకు, బాధ్యత నెరుగని అధికారుల ద్వారా ఏలాంటి అంతరాయం రాకుండా చూడాలి.

విశాఖపట్టణంలో డిపోలదగ్గర ప్రజారక్షకదళం పనిచేస్తూంది. ఇలా ఉండగా రెండు డిపోలదగ్గరకు రిజర్వుపోలీసుల్ని పంపించారు అధికారులు. ప్రజారక్షకదళాన్నిగుర్తించికూడా అధికారులు ఇలా చేశారు. రిజర్వుపోలీసులు రావడంతో అక్కడ సాఫీగా జరిగిపోతున్న దంతా అల్లకల్లోలం. అవకతవకల కిందికి దిగింది. చుట్టుపక్కల గ్రామస్థులు దొంగతనంగా ఎక్కువ ధరకు బియ్యం కొనడం కూడా ప్రారంభమయింది. వర్తకులు కూడా వాలంటీర్లను లక్ష్యపెట్టడం మానేస్తున్నారు. దీనివల్ల పేటలో ప్రజలకు బియ్యం కొరత మరీ తీవ్రమవుతూంది.

యిప్పటి యుద్ధపరిస్థితులలో విశాఖపట్నం ఆంధ్రరాష్ట్రానికేకాక, భారతదేశానికే ఒక ఆయువు పట్టు. అలాంటి ప్రదేశంలో ఇలాంటి పరిస్థితులు ముదిరినట్లయితే కలుగగల ఘోర పరిమాదాన్ని అధికారులు గుర్తించాలి. ప్రజావాలంటీర్లు శాంతిని కాపాడగలరు. అందుకు నిదర్శనం: విశాఖపట్నంలో నల్లమందుడిపో దగ్గర ప్రజల్లో అలజడిబయలుదేరి, వర్తకులు, పోలీసులు సర్దలేకపోతే ఇద్దరు వలంటీర్లు సునాయాసంగా సర్ది శాంతిని నెలకొల్పారు. డిపోలదగ్గర పరిస్థితుల్ని పూర్తిగా ప్రజావాలంటీర్లకు విడిచిపెట్టడం శ్రేయస్కరం. అధికారులు దీనిని గుర్తించాలి.

కిరసనాయిల్ కరువు

తిండి కరువుతోపాటు కిరసనాయిల్ కరువు కూడా ప్రజల్ని చాల ఆరాటపరుస్తూంది. ఈవిషయంలో కూడా కొన్ని చోట్ల అధికారులు సానుభూతితో ప్రవర్తించడం, మరికొన్నిచోట్ల గోడచుట్టుమీద రోకటిపోటులాగా అధికారం చలాయించడం జరుగుతూంది.

తూర్పుగోదావరిజిల్లా మండపేటలో కిరసనాయిల్ పంపకానికి ప్రజాసంస్థల యాజమాన్యాన 1200 రేషన్ కార్డులుపంచారు. ఈఏర్పాటువల్ల ప్రజలందరికీ కిరసనాయిల్ అందుతూంది. చౌకడిపోలు పెట్టించి, బియ్యం పంపకానికి కూడా ఇలాంటి ఏర్పాటే చేసుకోవాలని ప్రజల్లో దీక్షరేకెత్తింది. దీనివిషయమై కృషిప్రారంభమయింది.

ఆజిల్లాలోనే ఏడిదగ్రామంలో ప్రజలందరికీ కిరసనాయిల్ సక్రమంగా పంచిఇవ్వాలని గ్రామరైతుసంఘం తరపున గ్రామ మునసబు దగ్గరకు రాయబారం వెళ్ళారు. అతను లాభం లేదనేసరికి మండపేట రెవిన్యూఇన్స్పెక్టరువద్దకు వెళ్ళారు." కుటుంబాల లెక్కలుతీయండి. తప్పకుండా తగిన ఏర్పాటు చేస్తామని అతనన్నాడు. లెక్కలు తయారవుతున్నాయి.

కృష్ణాజిల్లా కాటూరు గ్రామంలో కోఆపరేటివు స్టోర్సు. కిరసనాయిల్ పంపకంలో ఎన్నో అవకతవకలు చేస్తూంది. నీటివల్ల కలుగుతూన్న కష్టాల్ని సహించలేక ఈమధ్య రెండువందలమంది స్త్రీలు, పురుషులు కమ్యూనిస్టు నాయకత్వంక్రింద స్టోర్సు కార్యదర్శి దగ్గరకు రాయబారం వెళ్ళారు. అప్పటినుంచి కిరసనాయిలు పంపకం సక్రమంగా జరుగుతూంది.

ఈ జిల్లాలోనే నందిగామ తాలూకాలో రేషన్ కార్డు పద్ధతిద్వారా కిరసనాయిల్ పంపకం ఏర్పాటు చేయవలసిందని తాలూకా యువజన సంఘం తహసీల్దారుని కోరింది. గ్రామాల్లో ఇండ్లలెక్కలు తయారుచేస్తే తప్పకుండా ఈపద్ధతిని అమలుజరుపుతానన్నారు. కాబట్టి తాలూకాలో ప్రతిగ్రామ యువజనసంఘం ఈ లెక్కలు తయారుచెయ్యాలనీ, బియ్యం సప్లయికి కూడా పనికివచ్చేలా తయారుచేయాలని తాలూకా యువజనసంఘ కార్యదర్శి కోరుతున్నారు. ఇంటి నెంబరు, పేరు, పెద్దచిన్న లెక్కలు, రోజుకుధాన్యంఖర్చు, నిలవధాన్యం, అరకల సంఖ్యను లెక్కలుతీయాలి.

ఈ అధికారులు ఇలా సద్భావంతో ప్రవర్తిస్తుంటే, పల్నాడు తాలూకాదాచేపల్లి గ్రామంలో రివెన్యూఇన్స్పెక్టరు ఇందుకు భిన్నంగా ప్రవర్తిస్తున్నాడు. అక్కడికి 7 డబ్బాల ఎర్రనూనె, 4 డబ్బాల తెల్లనూనె సప్లయి అవుతూంది. అప్పటి యువజనసంఘం ప్రతి ఇంటికి ఒక అణా చమురు పంచేలాగున వర్తకుడిని ఒప్పించాడు. చమురు పంచడంకూడా యువజన సంఘంవారే నెత్తిని వేసుకున్నారు. కాని, ఇంతలో పానకంలో పుడకలాగా రివెన్యూ ఇన్స్పెక్టరు వచ్చి యువకుల్ని అరెస్టు చేస్తానని బెదిరించి, సక్రమంగా సాగిపోతున్న చమురు పంపకాన్ని చిందరవందరచేశాడు. అతని ఆటలకు అంతులేకపోయింది. దీని కంతటికి తట్టుకోలేక వర్తకుడు తన లైసెన్సు వదులుకున్నాడు. ఇక ప్రజలకు కిరసనాయిల్ లేకపోయింది. ఇలాంటి పరిస్థితుల్ని ప్రభుత్వం వెంటనే అరికట్టాలి.

కర్నూలుజిల్లాలోని తురిమెళ్ళ గ్రామంలో 675 కుటుంబాలున్నాయి. కాని వారి చాలని కిరసనాయిలు సప్లయి. అది కూడా ఏనెలకానెల తగ్గిపోతూ వచ్చింది. చివరకు తనకువచ్చే స్వల్పచమురును అమ్మడం ప్రారంభిస్తే ఏమి ప్రళయం వస్తుందో అని సాహుకారు చమురు తేవడం మానేస్తున్నాడు. దీనికి తోడు కలరాకూడా వ్యాపించింది. ఈ సంగతంతా తహసీలుదారుకు చెప్పుకున్నా ఏమీ లాభంలేకపోయింది.

చివరకు కమ్యూనిస్టు యువకులు సాహుకారుని ఒప్పించి కలరా తగిలిన ఇళ్ళకు 1/4 సీసా చొప్పున చమురు పంచారు. ఇప్పటికి గ్రామంలో 25 మంది కలరావల్ల చనిపోయారు. ఈసంగతంతా జిల్లాకలక్టరుకి తెలియజేశారు.

★ యజమానుల చర్యలకు కార్మికులు రెచ్చిపోకూడదు

బెజవాడ డైమండుమెషినరీ మాన్యుఫాక్చరింగు వర్క్సులో ధాన్యం మిల్లులకు కావలసిన జల్లెడరకాలు, నూనెచేయుటకు కావలసిన యంత్రాలు, మోటారుకు గ్యాసుప్లాంటులు లేసుమెషీన్లు, ఇతర ఫ్యాక్టరీసామానులుచేస్తుంటారు. అంటే ఇతర దేశాలనుంచి సామానులు రాకుండా వున్న యీ రోజుల్లో ఇదెంత ముఖ్యమయినదో వేరే చెప్పనక్కరలేదు. అలాంటి పరిశ్రమలోని కార్మికులను, యజమాని చండూరి వెంకటరెడ్డి నానాఇగచాట్ల పాల్జేస్తున్నాడు. గత మూడు సంవత్సరాల నుంచి పడుతున్న కష్టాలను తీర్చుకోడానికి పనివారు మూడునెలల క్రిందట పౌండరీ వర్కర్సు యూనియన్లో చేరారు. చేరి తమ యూనియన్ని గుర్తించాలనీ; కార్మికులందరికీ కరువుభత్యం 8-8-0 ఇవ్వాలనీ; కార్మికులందరికీ జీతాలు పెంచాలనీ; ఆరునెలల నుంచి పనిచేస్తున్నవారి నందరినీ ఖాయంచేయాలనీ; ఏడాదికి సిక్కులీవు, క్యాజువల్ లీవు నెల పదిహేనురోజులు జీతంతో ఇప్పించాలనీ కోరారు. ఈ కోర్కెలు న్యాయసమ్మతమైనవి. వీటిని తెలియజేస్తే ఆ యజమాని మాటాడడానికి నిరాకరించి, కావలిస్తే సమ్మె చేసుకోండి అని అన్నాడట. ముఖ్యమైన పరిశ్రమలో సమ్మె అంటే ఏమిటో అతనికి తెలియదు కాబోలు. నాలుగువందల కార్మికుల సీవిధంగా ఇతను సమ్మెకు రెచ్చగొడుతున్నాడు. ఇందు విషయమై అధికారులు వెంటనే తగిన చర్య తీసుకోవాలి.

విజయనగరంలో

నాలుగు మాసాలనుంచి విజయనగరం మ్యునిసిపల్ పనివాళ్ళ సంఘం కరువుభత్యం కోసం ఆందోళన చేస్తూంది. 6-8-0 అలవెన్సు ప్రభుత్వం శాంక్షన్ చేసినా మ్యునిసిపల్ అధికారులు 4-8-0 తోనే ఆగారు. పనివారు ఒత్తిడిచేస్తే ఆలోచిస్తాం, మాఆలోచిస్తాం అని వాయిదాలు వేస్తున్నారు. చివరకు గట్టిగా అడుగుతే మీరు సమ్మెచేస్తే మేమే పూరు పని చేస్తాం అని ఛైర్మన్ కసిరాడు. ఊళ్ళో కలరా చెలరేగుతూంది. అలాంటి పరిస్థితుల్లో మునిసిపల్ పనివాళ్ళను సమ్మెకు రెచ్చగొట్టడమంటే ప్రజల ప్రాణాలతో ఆటలాడడమన్నమాట. ఈ విషయాన్ని గుర్తించి విజయనగరం మ్యునిసిపల్ అధికారులు ఇకనయినా తెలివి తెచ్చుకోవాలి.

నెల్లూరులో

ప్రభుత్వం శాంక్షన్ చేసిన 6-8-0 అలవెన్సుకి నెల్లూరు మ్యునిసిపాలిటీవారు మ్యునిసిపల్ పనివారికి 2-0-0 మాత్రమే ఇస్తున్నారు. అంతేకాకుండా కారణంలేకుండానే పనివారిని పనిలోనుంచి తొలగించడం పరిపాటయింది. పనివారు నివసించే పేటలో తవ్వించాలని నిర్ణయించిన బావి నింతవరకు తవ్వించలేదు. వీటన్నిటిని సానుభూతితో విచారించే నాధుల్లేరు. పనివారిలో అశాంతి పెరుగుతూంది.అధికారులు వెంటనే పనివారల కోర్కెలను నెరవేర్చి, నగర ఆరోగ్యాన్ని కాపాడాలి.

కాకినాడలో

కాకినాడ మ్యునిసిపల్ పనివారల ఇబ్బందుల్ని గురించి ఈనెల 16 వ తేదీన జిల్లా లేబరు ఆఫీసరు విచారణచేశాడు. ప్రభుత్వ స్కేలు ప్రకారం మ్యునిసిపాలిటీ జీతాలివ్వక ఇష్టంవచ్చినట్లు తక్కువ జీతాలిస్తున్నారు. దీనిని సరిచేయాలనీ, ప్రభుత్వంశాంక్షనుచేసిన 2-0-0 కరువు అలవెన్సు ఇప్పించాలనీ, పట్టణంలో తక్కువమంది పనివాళ్లు ఎక్కువ పనిచేస్తున్నారు కాబట్టి, ఉన్న నిరుద్యోగులకు కూడా పని కల్పించాలనీ, చౌక దుకాణాలు పెట్టించాలనీ, స్టాండర్డుబట్ట సప్లయి చేయాలని కోరారు. ఈ కోర్కెలను సాధ్యమైనంత వరకు తీరుస్తానని ఉద్యోగిచెప్పాడు.

పనివారికిప్పుడు కరువు అలవెన్సు ముడుతూంది.

తాడికొండ ఐ. ఎల్. టి. డి. కంపెనీలో

గుంటూరు తాలూకా తాడికొండలోని ఐ. ఎల్. టి. డి. కంపెనీలో కూలీలస్థితి, ముఖ్యంగా స్త్రీల స్థితి దుర్భరంగా వుంది. కంపెనీ ప్రారంభించి 15 సంవత్సరాలయినా స్త్రీలకు మరుగుదొడ్లులేవు. చంటిపిల్లల తల్లులు పిల్లలకు పాలివ్వడానికి సౌకర్యాలేవీలేవు. పనికాలానికి పరిమితిలేదు. వీటికి తోడిప్పుడు కరువురోజులు. నోరువిప్పితే పనిలోనుంచి తీసేస్తానని హెడ్ సూపర్ వైజరుబెదిరింపులు. వీటిని సహించలేక తమ సంగతిని బ్రాంచి మేనేజరుతో చెప్పాలని, ఈ నెల 15 వ తేదీన కూలీలు సమిష్టిగా అతన్నడిగారు. అతను మండిపడుతూ కూలీలను బయటికి తరిమాడు. అంతలో కమ్యూనిస్టు (మిగతా 5 వ పేజీలో)

పెరోల్ పై విడుదల చేయాలి

చిట్టివలస కార్మికసంఘ ఉపాధ్యక్షుడైన కామ్రేడ్ ముళ్ళపూడి వీరభద్రాన్ని ప్రభుత్వం 1943 ఫిబ్రవరిలో డిటెన్యూగా తీసుకొనిపోయింది.

ఇప్పుడు ఆయనభార్యా, పుత్రుడు చాల అనారోగ్యస్థితిలో ఉన్నారు. ఇట్లు ప్రమాదావస్థలో ఉన్న భార్యా బిడ్డల్ని చూసేందుకు కామ్రేడ్ వీరభద్రాన్ని వెంటనే పెరోల్ మీద విడుదల చెయ్యాలి.

—చిట్టివలస లేబర్ యూనియన్.

ఇవీ - అవీ

పశ్చిమగోదావరిజిల్లా కమ్యూనిస్టు కాన్ఫరెన్సు సందర్భాన ఆఖరురోజున జరిగిన వేలంపాట చాల ఉత్సాహంగా జరిగింది. నర్సాపురం, ఏలూరు తాలూకాలు పోటీపడ్డాయి. స్టాలిన్ ఫొటోను చివరకి రు.1116 లకు ఏలూరు గెల్చింది. కామ్రేడ్ జోషీని రు 1050 లకు నర్సాపురం తాలూకా లాక్కొంది. కాని చివరకి రెండు తాలూకాలు ఫిరాయించుకొని నర్సాపురం తాలూకాయే స్టాలిన్ను సంపాదించింది.

"టాన్యా" పుస్తకం పోటీలో రు 150 లకు కామ్రేడ్ పరకాల అహల్యాదేవి గెల్చుకొంది.

తల్లి "దినం" రోజున రాజకీయ కార్యక్రమం

కాటూరులో నాగళ్ళ వెంకట్రామయ్యగారి తల్లి "దినం" (13 వ తేదీ) సందర్భంలో, 2 వేల గ్రామ కూలీలకు భోజనవసతి కల్పించారు. స్థానిక ప్రజారక్షణ దళంవారు 30 మంది కలిసి చక్కని క్రమశిక్షణతో భోజనాలు వడ్డించారు. మధ్యాహ్నం 2 మొదలు 3 గంటల వరకు రాజకీయ చర్చలు, సమిష్టిగానం చేశారు. రాత్రి ప్రజారక్షణ దళాలు బాసలుతీరి, ఆహార సమస్య - రాజకీయ సంక్షోభం మొదలైన విషయాలపై పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిస్టుపార్టీ సభ్యుల కృషికి మెచ్చుకొని, వెంకట్రామయ్యగారు పార్టీకి రు 116 విరాళమిచ్చారు. చనిపోక ముందు తల్లిచేసిన వాగ్దానం ప్రకారం, రాయలసీమ నిధికి రు. 20 లు ఖరీదుగల ఒక చీరను యిచ్చారు.

యువజనసంఘాల కృషి

నందిగామతాలూకా యువజనసంఘం వారి యాజమాన్యాన వీరులపాడులో వైజ్ఞానిక శిబిరం నడుపబడిన తరవాత 4 గ్రామాలలో బుర్రకథ, వేషాలు వగైరా కార్యక్రమం జయప్రదంగా జరిగింది. వాటికి హాజరైనవారి మొత్తం సంఖ్య దాదాపు 2500. రాయలసీమ కరువు, రైతుసమస్యలు మొదలైన వాటిని గురించి బోధిస్తూ 4 వేలమంది ప్రజలలో ప్రచారం గావించారు. తత్ఫలితంగా, తాలూకా యువజనసంఘానికి రు 101-11-3, రాయలసీమ కరువునిధికి రు 6 లు, తాలూకా రైతు సంఘానికి రు 10, తాలూకా కమ్యూనిస్టు కమిటీకి రు 15-6-0, వసూలయింది.

కొణతమాత్మకూరులో యింటింటికి తిరిగి వసూలుచేస్తూంటే ముస్లిం యువతులుసహితం తమ పేదగుడిసెలలో ఉన్న గింజలలో నుంచి తీసి యిచ్చారు. అదే గ్రామంలో 75 సంవత్సరాల కటికిబీదవృద్ధ రాయలసీమ నిధికి 0-1-0 యిచ్చి "ఇంతకంటె ఎక్కువ యివ్వ" లేనని విచారించింది.

గ్రామతగాదాల పరిష్కారం

చీపురుపల్లి తాలూకా, కేశవరావుపేట (విశాఖపట్న జిల్లా)లో జూన్ నెలాఖరున 50 మందితో ప్రారంభమైన యువజనసంఘం గ్రామసమస్యల నెన్నింటినో పరిష్కరిస్తోంది. గ్రామతగాదాలను ప్రజలసహకారంతో సాకల్యంగా విచారించి, తీర్పులిస్తున్నారు. తప్పును బట్టి శిక్షలు విధిస్తున్నారు. గ్రామపారిశుద్ధ్యాన్ని పెంపొందిస్తున్నారు. ప్రతి శనివారం గ్రామసమస్యల పరిష్కారానికి సమావేశ మవుతున్నారు.

కిరసనాయిల్ సప్లయి

చిత్తూరు జిల్లా యేకాంబ్రకుప్పం అనే గ్రామంలో యువజన సంఘంవారు కిరసనాయిలు సక్రమంగా పంచడానికి కుటుంబ లెక్కలు తీసుకొని, మొత్తం 650 రేషన్ కార్డులు పంచిపెట్టారు. ఆగ్రామానికి వచ్చే కోటాను యీ 650 కుటుంబాలకు వారము 1 కి అరబుడ్డి చొప్పున సమానంగా పంచిపెట్టనారంభించారు. ఇలా 2 వారాలు గడిచింది. ప్రతిదుకాణం వద్ద వాలంటీర్లు నిలబడి, పై లెక్క ప్రకారం న్యాయంగా పంచునట్లుచేశారు. కాని, 2 వారాలు గడచాక, ఒకదుకాణదారు గ్రామమునసబు సహాయంతో కార్డుపద్ధతిని అమ్మనని నిరాకరించాడు. క్రమంగా మిగతా యిద్దరినీ అలాగే నిరాకరింపజేశాడు. కిరసనాయిలు కొందరికి దొరికి, కొందరికి దొరక్క అనేక యిబ్బందులు పడుతున్నారు. యువజన సంఘం గ్రామస్థుల సంతకాలతో ఒక అర్జీ తయారుచేసి, డిప్యూటీ తహసీల్దారుకు పంపింది (3-7-43). దుకాణదారుల్ని విచారించుటకు సమన్లు జారీచేయబడ్డాయి.

రాయలసీమ కరువునిధి

2-7-43 నుండి 21-7-43 వరకు జమాఖర్చులు

జమ	రు. అ. పై.
క్రిందటిసారి ప్రకటించిన జమలు	5866-12-7
బియ్యం అమ్మటద్వారా వచ్చింది.	19- 4-0
రైళ్ళలోనసూళ్ళు	34-10-9
పొట్టిపాడులో వివాహాలలో	3- 0-0
జమీదింటకుర్రులో	2-13-0
ఒంగోలులో	2- 0-0
నెల్లూరుజిల్లా రైతుసంఘం	61-15 0
పశ్చిమగోదావరిజిల్లా రైతుసంఘం	50- 0-0
బెజవాడ తాలూకా రైతుసంఘం	21- 9-1
రాజమండ్రి తాలూకా రైతుసంఘం	10- 0-0
గుంటూరుతాలూకా రైతుసంఘం	20- 0-0
రాజోలుతాలూకానుండి	7-15-0
నర్సారావుపేటతాలూకా కమ్యూనిస్టు కమిటీ	9- 3-0
బెజవాడటౌన్ కమ్యూనిస్టు కమిటీ	37-10-0
నాగాయతిప్పగ్రామకమ్యూనిస్టు కమిటీ	1- 8-0
బాపట్లతాలూకా వలంటీరుదళం	12-10-3
కొవ్వూరుతాలూకా కాంగ్రెస్	2- 4-6
నెల్లూరు కల్చరల్ దళం	1-12-6
గుడ్లవల్లేరు యువజనసంఘం	14- 0-0
తెన్నేరు యువజనసంఘం	5- 0-0
రాజమండ్రి షాపు ఎంప్లాయిస్ యూనియన్	3- 0-0
రాజమండ్రి విద్యార్థిసంఘం	1- 0-0
ముంగండ బాలసంఘం	1-11-0
వీరవాసరం శెట్టిబలిజ సంఘం	3- 0-0
మిత్రిపాడినుండి	25- 0-0
నంగలపూడినుండి	5- 0-0
పిఠాపురంనుండి	5- 0-0
రాజమండ్రినుండి	5- 0-0
సామర్లకోటనుండి	1- 0-0
భీమవరంనుండి	3- 0-0
ఉండినుండి	0- 8-0
పోతునూరునుండి	7- 0-0
వీరవాసరంనుండి	4- 0-0
పాలకొల్లునుండి	1- 0-0
కంభంపాడునుండి	15- 0-0
ఊటుకూరునుండి	7- 0-0
అట్లప్రగడనుండి	4- 0-0
మానికొండనుండి	16- 0-0
పెయ్యేరుగ్రామంనుండి	28- 8-0
కాటూరునుండి	2- 0-0
పెనమద్దానినుండి	26- 0-0
బెజవాడ మహిళలనుండి	5- 0-0
వణుకూరునుండి	0-13-0
కలవపాములనుండి	3- 0-0
బుట్టాయిగూడెం బెజవాడలో	3- 0-0
క్రొత్తపట్నంనుండి	6- 0-0
వేల్పనూరునుండి	2- 0-0
వెలగోడునుండి	3- 0-0
కంభంమెట్టునుండి	18- 0-0
కృష్ణాజిల్లా ఒక గ్రామంనుండి	20- 0-0
ఒకవర్కరుకు పంపినడబ్బు తిరిగివచ్చుటచే	20-0-0
జమ మొత్తం	6428- 7-8
ఖర్చు	
క్రిందటి సారి ప్రకటించిన ఖర్చులు	4686-11-6
కర్నూలు జిల్లాకరువు కమిటీకి	506-4-0
బట్టలు మూటలు పంపుటకు	4-0-6
వర్కర్లకు బెజవాడలో భోజనాలకు	1-13-0
వర్కర్లకు పుస్తకాలుపంపుటకు	12-5-0
బళ్ళారి జిల్లాకు పంపిన ముగ్గురు వర్కర్లకు	60-0-0
కడప జిల్లాలోని యిద్దరు వర్కర్లకు పంపినది	40-0-0
చీమలవాగుపల్లిలోని వర్కరుకు M. O.	25- 0-0
బొకుక్యాంపులో యిద్దరికి పంపినది M. O.	40- 8-0
ఖర్చు మొత్తం	5377- 9-0
నేటినిల్వ	1050-14-8
	6428- 7-8

కృష్ణాజిల్లా రావులపాడునుండి; ప. గో. జిల్లానుండి; గుంటూరుజిల్లానుండి వచ్చిన బట్టలు మొత్తం 400 కాళ్ళీలు అనంతపురం జిల్లాకు పంపితిమి.

—నండూరి ప్రసాదరావు.
ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ ప్రధానకార్యదర్శి, బెజవాడ

మునగాల ఎస్టేటులో అధికోత్పత్తికి ఆటంకాలు

మునగాల గ్రామకాపురస్థుడైన తంగెళ్ళ బుచ్చాలు అనే రైతుకు తారువాయి శివారులో కొంతభూమి ఉంది. అందులో అనాదినుండి ఒక చిన్నకుంటఉంది. ఆకుంటలోనీరు ఉన్నా లేక పోయినా, భూమిని బావిక్రింద సాగు చేసుకున్నా, రైతునీటితీరువ కట్టవలసిందే. ఈ మధ్య ఆకుంటలోకి కొద్దిగా నీరువచ్చింది. అది పంటకు సరిపోదు. అయినా, నీటితీరువ చెల్లించు తానని ముందుగానేవ్రాసి యివ్వవలసిందని ఉద్యోగస్థులు ఒత్తిడి చేశారు. రైతు వ్రాసి యివ్వలేదు. ఈకక్షతో 12-7-43 వ తేదీన కొంతమంది ఎస్టేటు నౌకర్లను తోలించి అర్ధరాత్రివేళ తూమును పగలగొట్టించారు. దాన్ని తిరిగి కట్టుకొనే సరికి వారంరోజుల నీరువృధాగాపారిపోయింది.

ఈవిధంగా అధికాహారోత్పత్తికి ఆటంకాలు కలిగించే ఉద్యోగస్థులపై జమీందారు చర్య తీసుకోవలసిందని కోరుతున్నాను.

ఉప్పల రామయ్య
(మునగాల జమీన్ రైతుసంఘకార్యదర్శి)

(4 పేజీ తరువాయి) వర్కర్లక్కడికి వచ్చి కూలీలు రెచ్చిపోకుండా సర్దారు. బ్రాంచి మేనేజరు వేరే కూలీలను తేడానికి ప్రయత్నించాడు. కాని, ఆఆట సాగలేదు. దానిపై గుంటూరువెళ్ళి సర్కిల్ మేనేజరును తీసుకువచ్చాడు. అతనువచ్చి కూలీలందరూ పనిలోకి వెళ్ళండి, కష్టాలనువిని సాధ్యమైనంతవరకు సహాయం చేస్తానన్నాడు. అతనితో మాట్లాడటానికి కూలీలొక కమిటీని ఎన్నుకున్నారు.

కార్మికులు యజమానులు కలసి ఉత్పత్తిని ఎక్కువచేయవలసిన ఈరోజుల్లో పనివాళ్ళను సమ్మెలకు రెచ్చగొట్టడం బాధ్యత నెరుగనివాని.

విజయసాధనకు మా పూర్తి సహకారము!

ఈ నెలారంభంలో నైజాం రైల్వే పూర్ణాలో కార్మికులసమావేశం జరిగింది. వందలకొలది కార్మికులు పాల్గొన్నారు. నైజాం రైల్వేకార్మికుల యూనియన్ ఉపాధ్యక్షుడు కామ్రేడ్ మక్దుం మొహిద్దీన్, ప్రధానకార్యదర్శి యన్. రామచంద్రరావు, ఇంకా ఇతర ప్రముఖులు సికంద్రాబాదు నుంచి వచ్చారు.

మక్దుంగారు సమావేశాన్ని ప్రారంభించారు. తమ నాయకులను విడిపించుకోడానికి నైజాం రైల్వేకార్మికులు చేసిన త్యాగాలను వీరు పొగిడారు. కార్మికుల విజయాలను పేర్కొన్నారు. రైల్వేపనివారందరికీ జోన్ల భేదంలేకుండా, అందరికీసమానంగా రు.30-0-0 అధికధరల అలవెన్సుకోసం అఖిలభారత రైల్వేపనివారల సమ్మేళనం కృషిచేస్తూందని తెలిపారు. ఈకోరిక నంగీకరించని రైల్వే బోర్డు వైఖరిని ఖండించారు. జపాను ప్రమాదం దేశాన్నెదుర్కొంటున్న ఈ రోజుల్లో రైల్వే కార్మికులను అసంతృప్తి పాల్జేయడం ప్రమాదకరమన్నారు. కార్మికులు దేశరక్షణపట్ల తమ బాధ్యతను గుర్తించి, భారతదేశాన్ని రక్షిస్తున్న సైనికులకు చేదోడువాదోడుగా నిలచి, దేశాన్ని ఫాసిస్టుప్రమాదంనుండి కాపాడాలని ఉద్బోధించారు.

తరువాత ఇతర ప్రముఖులు మాట్లాడారు. రైల్వే కార్మికుల యూనియన్కి, ప్రభుత్వానికి, రైల్వే అధికారులకు మధ్య ఏర్పడిన మంచిసంబంధాన్ని చెడగొట్టడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి ప్రయత్నాలు పంచమాంగదళానికి, ఫాసిస్టు శత్రువులకు తోడ్పడతాయని కార్మికులను హెచ్చరించారు.

తరువాత బ్రాంచి యూనియన్ ఎన్నికలు జరిగాయి. కామ్రేడ్ అగస్టయిన్ జోసఫ్ బ్రాంచి ఉపాధ్యక్షుడుగాను, కామ్రేడ్ యం. ఏ. గఫర్ కార్యదర్శిగను, ఎన్నుకోబడ్డారు.

అందరికీసమానంగా రు.30-0-0 అలవెన్సు ఇవ్వాలని, ప్రధాన కార్యాలయం వారికి ఏపద్ధతి ఆహారపదార్థాలు సప్లయి చేస్తారో, ఆ పద్ధతినే అవుట్ స్టేషన్ల వారికి కూడా సప్లయి చేయాలని తీర్మానించారు.

ఫాసిస్టు మూకల్ని ఓడించి, సంపూర్ణ విజయం సాధించడానికి రైల్వే కార్మికులు తమ కృషిని కొనసాగించాలనీ; ఉత్పత్తి నెక్కువ చేయడానికి, రాకపోకలు ఇంకా త్వరగా జరపడానికి కార్మికుల, యజమానుల సమిష్టి కమిటీ లేర్పాటు చేయాలని తీర్మానించారు.

గ్యాంగ్ పనివారల పనికాలం నిర్ణయించాలని, రోజుకు ఎనిమిదిగంటలపని, ఆదివారం సెలవు అమలు జరపాలని తీర్మానించారు.

జాతీయైక్యతకు గ్రామైక్యత పట్టుగొమ్మ

★

[illegible] తాలూకా, [illegible] గ్రామంలో 27-6-43 న రైతులకూ - వ్యవసాయకూలీలకూ మధ్య తీవ్రమైన ఘర్షణ జరిగింది. రివాజుగా యిచ్చే కూలి రేటుకంటె తక్కువ రేటుకు 50 మంది కూలీలు ఒప్పుకొని, పనికి వెళ్తూంటే, యితర కూలీలలో కొందరు సహించలేక, అటంకపరిచారు. రైతులు ఆకువేయించుకొనియున్న కారణంగా, ఒక రైతు ఆవేశం పట్టలేక ఒక వ్యవసాయ కూలీని కర్రతో పొడిచాడు. వెంటనే కూలీలు సమ్మెచేశారు. ఉభయ పక్షాలవారు ఉద్రేకంలో చేసిన యీ పనులు అధిక పంటల ఉత్పత్తికి ఎంత హాని కలిగిస్తాయో, రైతు సంఘ నాయకులు, కూలీసంఘ ఆర్గనైజరు, వెంటనే తెలుసుకొని, ఉభయుల మధ్య సామరస్యం కలిగించారు. కూలీల సమ్మెను ఆపుజేశారు. రైతులు మొదట యిచ్చేకూలి రేటుకంటెకూడా యెక్కువయిచ్చి (పురుషునికి రు. 1-0-0, స్త్రీకి 0-14-0), పనులు సక్రమంగా చేయించుకుంటున్నారు.

ఉమ్మడి ఆదాయంయొక్క ఉపయోగం

గన్నవరం తాలూకా, నాగన్నగూడెంలో వ్యవసాయ కూలీసంఘం గావించిన కృషి ఫలితంగా, కూలీలమధ్య బయల్దేరిన తగవులు పరిష్కరించబడ్డాయి. అందువల్ల, సంఘం పోగొట్టుకున్న ఉమ్మడి ఆదాయాన్ని తిరిగి రాబట్టుకొన గల్గింది. కూలీ సంఘం దానితో మూడు రోజ్లు పోయించి, ఐక్యతయొక్క ప్రభావాన్ని రుజువుచేసింది. అంతే గాక, రైతు-కూలీ సంఘాల సమిష్టి ప్రయత్నంవల్ల 60 కుటుంబాలు నివసించే యీ పల్లెకు మూడు దబ్బాల కిరసనాయిలు లైసెన్సు వచ్చింది.

లాటరీ జూదగాండ్రఆట కట్టింది

కోవూరు తాలూకా, రామతీర్థం గ్రామంలో (నెల్లూరు జిల్లా) గతనెల 29, 30 తేదీలు, యీ నెల 1 వ తేదీ, పెద్ద తిరునాళ్ల జరిగే రోజులు. సుమారు 50 వేలమంది ప్రజలు 100 గ్రామాలనుండి ప్రయాణమై వచ్చారు. [illegible] లాటరీజూదగాండ్ర మోసంనుండి ప్రజల్ని రక్షించడానికి జిల్లారైతుసంఘ కార్యదర్శి, సహాయ కార్యదర్శి, తాలూకా కమ్యూనిస్టు కమిటీ ఆర్గనైజరు, 25 గురు వాలంటీర్లతో కలిసి తిరునాళ్ళ జరిగే స్థలానికి వెళ్లారు. లాటరీలో వున్న మోసాన్ని గురించి [illegible] సభలలో చక్కగా బోధించి, జూదగాండ్ర [illegible] - బోర్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కృషికి ప్రజలెంతో మెచ్చుకొని, వాలంటీర్ దళాలకు తోడ్పడ్డారు. జూదగాండ్రు పోలీసులకు లంచంపెట్టడానికి ప్రయత్నించారు. కాని, 50 వేలమంది ప్రజానైక్యతవల్ల పోలీసులు చేసేదిలేక, వాలంటీర్ల వద్దకే వారిని పంపించారు. వాలంటీర్లు జూదగాండ్రకు [illegible]

... సహకరించి, పార్టీవారితో చేతులు కలిపి పనిచేయడం [illegible] వారిలో పశ్చాత్తాపం కలుగజేసి పంపించారు. సునరైతుసంఘప్రచారకులు, హార్మోనిస్టు కలిసి ప్రజలలో బహిరంగసభలు, సెట్లు, బుర్రకథలు, గొల్లసుద్దులుచెప్పి, ఆహార సమస్య - అధిక పంటల ఉత్పత్తి - మొదలైన సమస్యలపై ప్రచారం గావించారు.

పార్టీనిధికి పారదమ్ము

దివితాలూకా, నంగెగడ్డ గ్రామంలో స్థానిక కమ్యూనిస్టుకమిటీ కూలీలకూ - రైతులకూ మధ్య సామరస్యం సమకూర్చి ముందుకు నడుపుతూన్నందుకు వారు కృతజ్ఞతతో కాయకష్టం చేసి పార్టీకి డబ్బు వసూలుచేయ నిశ్చయించుకున్నారు. 5-7-43 వ తేదీని 30 మంది కూలీలు-రైతులు కలసి, కామ్రేడ్ అమ్ముల రామమూర్తి పొలంలో 2 యకరాలను దమ్ముచేసి, పార్టీనిధికి రు 6-4-0 సంపాదించి యిచ్చారు. కామ్రేడ్ రామమూర్తి యితరులతో పాటు సమానంగా చెమటోడ్చి పనిచేశాడు! ఈ ఘటన గ్రామంలోనున్న యితర రైతుల్ని - కూలీలనూ ఉత్తేజ పరచింది. మిగతా పొలాలలోకూడా యీ సాంప్రదాయం వ్యాపిస్తోంది.

ఇలాంటి కృతజ్ఞతతోనే రేపల్లె తాలూకా దేతపూడి గ్రామంలోవ్యవసాయకూలీకామ్రేడ్స్ పార్టీ నిధికి తాళం, తాళంచెవి, గ్లాసు, సారవగైరా నస్తువులిచ్చారు. వారందరు పార్టీసభ్యులే. ఆపార్టీసెల్‌లోనే వీటిని పాటకుపెట్టి, రు 7 నం పాడించారు.

ఆంధ్ర జమీందార్లేమంటారు?

కేరళరాష్ట్ర రైతుసంఘం గావించిన విజ్ఞప్తి ఫలితంగా, ఇద్దరు జమీందారులు నరకోట్ మనాజమీందారు, కల్లియట్ పదియూర్-కల్లియట్ గ్రామం వద్ద (చిరక్కల్ తాలూకా) 600 యకరాల భూమిని, శిస్తులేకుండా, అధికాహారోత్పత్తికి యిచ్చారు. ఎర్నాడ్ తాలూకాలో యు. సి. నారాయణన్ నంబూది అనే మరొక జమీందారు పాయూర్ గ్రామ రైతుసంఘానికి 75 యకరాల భూమిని, శిస్తులేకుండా, అధికాహారోత్పత్తికి యిచ్చారు.

—'హిందూ' పత్రిక : 21-7-43

ఆంధ్రజమీందార్లు దేశభక్తియుక్తమైన తమ కర్తవ్యాన్ని నెరవేర్చడంలో మలబార్ జమీందార్లకు వెనుక బడతారా?

కూలీల కట్టుబాటు

భట్లపెనుమర్రు గ్రామంలో (దివితాలూకా) గతమాసం రైతులకూ-కూలీలకూ మధ్య జరిగిన ఒడంబడిక ప్రకారం, కూలీలు రోజుకు 8 గం|| ల చొప్పున పనిచేస్తూ పురుషులు 9తవ్వలు, స్త్రీ 7తవ్వలు చొప్పున (ధాన్యం)తీసుకొంటున్నారు. కాని, యీమధ్య కొందరు రైతులు తమ ఊడ్పులు ముందు కావాలనే ఆతురతతో, ఎక్కువకూలి యిస్తామని ఆశ చూపెట్టారు. కాని కూలీలు మామూలురేట్లే తీసుకుంటామని చెప్పి, శిక్షణతో తమ సంఘ కట్టుబాటును పాటించారు.

న్యాయమైన పంపకం

అనంతపురం తాలూకా, పూలకుంట అనే గ్రామంలో 40 మంది పేదరైతులు ఆకుతోటలను సమిష్టిగా పెంచుకొని, జీవించడం పరిపాటి. ఈమధ్య వీరు తగాదాలుపడి, వేర్వేరుగా పెంచుకొన సాగారు. మొదట తాము సమిష్టిగా ఉపయోగించుకొనే కపిల చర్మం, కపిల సామానులు, కొయ్య పనిముట్లు వగైరా పంచుకోవడంలో 12-7-43 వ తేదీని పెద్ద తగాదావచ్చి, దొమ్మీగా తయారయే పరిస్థితి యేర్పడింది. వెంటనే, స్థానిక రైతుసంఘ వర్కర్లు దొమ్మీవల్ల వచ్చే దుష్ఫలితాలను వివరించి, ఉభయపార్టీలఅంగీకారంతోఆవ్యవసాయ పనిముటను న్యాయంగా పంచిపెట్టారు. రైతులు సంతోషించి, యికముందు తమకెట్టి తగాదా వచ్చినా రైతుసంఘమే పరిష్కరించాలని కోరారు.

ధాన్యం కమాండీరింగు పద్ధతిలోని లోపాలు

★

కోవూరు తాలూకాలో జిల్లా సర్వేయింగ్ ఆఫీసరు అవలంబించే కమాండీరింగ్ పద్ధతి అనేక అవకతవకలతో కూడుకొని, రైతులకు చెప్పరాని యిబ్బందులు కలిగిస్తోంది. తలమంచి గ్రామంలో జొన్నా శేషయ్య అనే రైతుకు 8 యకరాల పొలం ఉంది. పండిన పంట 8 పుట్లు. కాని, 15 పుట్లు యివ్వమని నోటీసు. ముత్యాల వెంకయ్యకు ఉన్న పొలం 10 యకరాలు. పండిన ధాన్యం 10 పుట్లు. శిస్తు వగైరాలుపోను నిల్వ 2 పుట్లు. కుటుంబంలోనివారు 8 గురు. నోటీసు 10 పుట్లకు. వేగూరు సుబ్బారాయుడు అనే మరొక రైతుకు ఉన్న పొలం 60 యకరాలు. పండిన పంట 52 పుట్లు. శిస్తులు వగైరాపోను నిల్వ 25 పుట్లు. నోటీసు 35 పుట్లకు. పురిణి అనేమరొక గ్రామంలో దేవిరెడ్డి వెంకట రమణయ్యకు ఉన్నపొలం 23 యకరాలు. పండిన ధాన్యం 13 పుట్లు. కాని, కళ్ళంలోనే అప్పుదార్లు దాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయినా, 9 పుట్లకు నోటీసు. కొమ్మలపూడి దశరథరామయ్యకు ఉన్నపొలం 12 యకరాలు. పండిన ధాన్యం 10 పుట్లు. శిస్తులు వగైరాపోను మిగలాది తిండికి చాలదు. కాని, 9 పుట్లకు నోటీసు.

ఈనెల 16 వ తేదీనుండి వందలకొద్దీ రైతులు, భూస్వాములు యిట్టి అక్రమాలను తొలగించుకొనుటకై కొడవలూరువస్తున్నారు. కాని, సర్వేయింగ్ ఆఫీసరు రైతుల గోడును సరిగా వినకమేలేదు. ప్రతిరైతు యింతధాన్యం యివ్వాలని తనక్యాంపునుండి నోటీసులు జారీ చేస్తున్నాడు. ఇవ్వకుంటే, దేశరక్షణ చట్టం ప్రకారం చర్యతీసుకొనబడుతుందని తెలియ జేస్తున్నాడు. గ్రామ అవసరాలనుగాని, రైతు అవసరాలనుగాని, గమనించుటలేదు.

ఇట్టి కమాండీరింగ్‌వల్ల దేశంలో తిండికి కరువేర్పడి, దోపిడు - అరాజకం వ్యాపించి, పంచమాంగ దళం విషప్రచారం చేయడానికి మంచి అవకాశం ఏర్పడుతుంది. జిల్లా సర్వేయింగ్ ఆఫీసరు యీప్రమాదాన్ని గమనించినట్లులేదు.

కాని, ప్రజలు గమనించవలసియుంది. ప్రతిగ్రామంలోను అన్నిపక్షాల ప్రజలతోగూడిన ఆహార కమిటీని ఎన్నుకొని, ఒక్కొక్క రైతు ఆఫీసరు వద్దకు వెళ్ళనవసరంలేకుండా, యీ కమిటీయే వ్యవహరించాలి. ప్రతి గ్రామంలోను జనసంఖ్య, పంట, నిల్వ వగైరా వివరాలను గూర్చి లెక్కలు తీసుకోవాలి. మరల పంట వచ్చేవరకు గ్రామంమొత్తంమీద అవసరాలకు పోను నిల్వ ఉండు ధాన్యాన్ని సర్వేయింగ్ ఆఫీసరుకు అమ్మడానికి ఆహారకమిటీ తయారు కావాలి. ఈ క్రింది కోర్కెలు గల పిటీషన్‌ను ప్రతి గ్రామంనుండి జిల్లా కలెక్టరుకు, కమర్షల్ టాక్సు ఆఫీసరుకు,పంపాలి :

1. మరల పంటవచ్చేవరకు గ్రామానికి కావలసిన ధాన్యాన్ని నిలపాలి.

2. కమాండీరింగ్‌ను అమలుజరిపేటప్పుడు సర్వేయింగు ఆఫీసరు స్థానిక ఆహార కమిటీల, లేనిచోట్ల రైతుసంఘాల సహాయం తీసుకోవాలి.

3. ఇప్పుడు మద్రాసులో ఉన్న నెల్లూరు బియ్యం రేటు ప్రకారం కిట్టుబాటు అయ్యేధరకు కొనాలి. లేదా, ఫ్యాక్టరీలలో మిషన్ పట్టించే సౌకర్యం కలుగజేసి బియ్యాన్ని ఆహారకమిటీచే రవాణాచేసే యేర్పాట్లు చేయాలి.

4. చెక్కులు ప్రతిరైతు బెజవాడ వెళ్ళి తెచ్చుకోడంకాక, నెల్లూరులోనే యివ్వాలి.

—బి. శంకరయ్య,
(జిల్లా రైతుసంఘ కార్యదర్శి.)
—యు. వి. శేషయ్య,
(కోవూరు తాలూకా రైతుసంఘ కార్యదర్శి.)

★

400 వంటశాలలు, 8000 మణుగుల బియ్యంతో అన్నం!

చిటగాంగ్ జిల్లాలో ఆహారకమిటీ నెరవేర్చనున్న కార్యక్రమం

జూన్ 24 వ తేదీని చిట్టగాంగు జిల్లా ఆహారకమిటీ సమావేశమైనప్పుడు, ప్రతినెల ఆకలిచే బాధపడే ప్రజలకు 400 వంటశాలలలో 8000 మణుగుల బియ్యంతో అన్నం వండి పెట్టాలని తీర్మానించారు.

జులై 1 వ తేదీనాటికి అట్టి వంటశాలలు 72 తెరువబడ్డాయి. వాటిలో 1000 మణుగుల బియ్యం వండించి పెట్టారు. త్వరలో పూర్తిగా 400 వంటశాలలు తెరువబడతాయని ఆశించవచ్చు. ఎందువల్లనంటే, యీరోజున చిటగాంగ్ జిల్లా ఆహారకమిటీ జిల్లాప్రజలందరి విశ్వాసాన్ని చూరగొంది. దానికి జిల్లాకలెక్టరు అధ్యక్షుడు. స్పెషల్‌ఆఫీసరు, కామ్రేడ్ హిమాన్సు మజుందారు సంయుక్తకార్యదర్శులు, ఆర్. ఎ. సిద్దీక్ అను ముస్లింలీగ్ నాయకుడు, కామ్రేడ్ పూర్ణేందుదస్తీదార్, వర్కింగ్‌కమిటీలో సభ్యులు.

ప్రతినెల యీ 8000 మణుగుల బియ్యం కొనడానికి 2½ లక్షల రూపాయ లవసరం. అందులో సగం మొత్తాన్ని బెంగాల్ ప్రభుత్వం యిస్తుంది. మిగిలిన సగం చందాలద్వారా వసూలు చేస్తారు. ఇప్పటికి 1 వెయ్యి రూపాయలు వసూలయింది. చాలామంది ధనికులు పెద్ద పెద్ద మొత్తాలను వాగ్దానం చేశారు. దేశభక్తియుతమైన ఈకార్యంలో ఆహారకమిటీ తప్పక జయించుతుంది. ఎందువల్లనంటే, చిట్టగాంగ్‌కు యీరోజున ఏర్పడ్డ ఫాసిస్టు ప్రమాదం జిల్లా ప్రజలందరినీ, రాజకీయ పార్టీలన్నింటినీ, ఐక్యం చేసింది.

లీగ్ నాయకుల ప్రశంసలు

ఉదాహరణకు, ముస్లింలీగ్ డిఫెన్సు కమిటీ అధ్యక్షుడైన నవాబ్ ఇస్మాయిల్‌ఖాన్ యీమధ్య చిట్టగాంగ్‌కు వచ్చినప్పుడు, కమ్యూనిస్టులతో లీగ్‌చేసే సహకారాన్ని చూచిప్రశంసించాడు. అదేరోజున జరిగిన బహిరంగసభలో ఇస్మాయిల్‌ఖాన్ ఉపన్యసిస్తూ, చిట్టగాంగ్ ప్రజలమధ్య ఏర్పడిన స్నేహభావాన్ని, ఐక్యతను, ఎంతో కొనియాడాడు. ఆహార సమస్యను పరిష్కరించడంలో స్థానిక ముస్లింలీగ్ వర్కర్లు ఇతర రాజకీయ పార్టీలతో సహకారం చేయవలసిందని హెచ్చరించాడు.

ఇది జరిగిన కొంతకాలానికి స్థానిక "సోవియట్ మిత్రమండలి" వారు హబిబుల్లా రహిమాన్ (రాష్ట్ర ముస్లింలీగ్ నాయకులలో ఒకరు) మొదలైన లీగ్ వర్కర్లను తమ కార్యాలయానికి ఆహ్వానించారు వారు దాన్ని స్వీకరించి వచ్చారు. అక్కడ ముస్లింజాతుల స్వయంనిర్ణయ హక్కును గురించి చక్కని చర్చ జరిగింది. తమ కమ్యూనిస్టుసోదరులతో కలిసి పనిచేయడానికి తమ సంసిద్ధతను ప్రకటించారు.

యుద్ధ సమీక్ష

■ మూడవ జర్మను దండయాత్ర కూడా ముక్కచెక్కలైంది
■ ముస్సోలినీ రాజీనామా

హిట్లర్ సాగించిన మూడవ వేసవి దండయాత్ర ముక్క చెక్కలైంది. జులై 5 వ తేదీన ప్రారంభమైన ఈదాడి 23 వ తేదీకి భగ్నమయింది. మొదటి పదిరోజులపాటు, ఆత్మరక్షణా యుద్ధాలు గావించిన సోవియటు సైన్యాలు, హఠాత్తుగా, ఓరెల్‌కు ఉత్తరంగాను, తూర్పుగాను ఎదురుదాడి సాగించాయి. జులై 5 వ తేదీకి పూర్వం ఉన్న ప్రాంతాలన్నిటినీ వశపరచుకొనడమేగాక, ఓరెల్ రంగంలో మరికొన్ని కొత్త ప్రదేశాలను లాక్కొగల్గింది. బోల్ఖావ్, మిచెన్స్, జీమ్కా, అనే కీలక ప్రదేశాలను పట్టుకొని, రెడ్ఆర్మీ ఓరెల్‌కు ఉత్తర- తూర్పు- దక్షిణ- భాగాలనుండి క్రమ్ముకొని వస్తోంది. తిరోగమించుతున్న జర్మను సైన్యాలు, ఎదురుదెబ్బలు కొట్టాలని ప్రయత్నించుతూ విపరీత నష్టాలకు గురిఅవుతున్నాయి. ఓరెల్ లోపలి రక్షణలలోకి పోవాలన్న జర్మన్ల ఉద్దేశాన్ని రెడ్ఆర్మీ, భగ్నపరచజూస్తోంది. ఈ విజయాలకు కారణం ఏమిటి? రెడ్ఆర్మీ ఈ రెండు సంవత్సరాలయుద్ధాలలోను బలపడింది. మంచి నైపుణ్యం, ఆత్మవిశ్వాసం సంపాదించింది. కథ అడ్డం తిరిగిందనీ, శత్రువును హతమార్చే అంతిమయుద్ధాలు ప్రారంభమయాయనీ, రెడ్ ఆర్మీకి తెలుసు. అందుకనే ఇంత సత్వర విజయం.

వేసవి దండయాత్ర విఫలం అయింది

సోవియటు సైనిక నాయకులకు పంపిన సందేశంలో (ఆర్డర్) కామ్రేడ్ స్టాలిన్, ఈ విషయాలను పూర్తిగా వివరించాడు. అందు ముఖ్యభాగాలను చూద్దాం.



"మన సైన్యాలు జర్మనీ సాగించిన వేసవి దాడిని, పూర్తిగా భగ్నంకావించాయి. 23 వ తేదీ సైనిక చర్యలతో ఆపని పూర్తి అయింది. హిట్లర్, ఓరెల్-కుర్స్క రంగంలో, 7 టాంకు దళాలను, 2 మోటారు దళాలను 11 పదాతి దళాలను ఉపయోగించాడు. బైలోగ్రాడ్-కుర్స్క రంగంలో 10 టాంకుదళాలను, 1 మోటారు దళాన్ని, 7 పదాతిదళాలను, ఉపయోగించాడు. వీటినన్నిటినీ కొద్ది ప్రదేశంలో (200 మైళ్లు) కేంద్రీకరించి, కుర్స్కకు ఉత్తర దక్షిణాలనుండి దెబ్బగొట్టి, కుర్స్క వంపులోనున్న మన సైన్యాలను చుట్టుముట్టి హతమార్చాలని శత్రువు ఆశయం.

దీనికి మనం సిద్ధంగానే వున్నాం. అంతేగాదు. మంచి ఎదురుదెబ్బలు గొట్టడానికికూడా సిద్ధంగా వున్నాం. జర్మనీ చొచ్చుకువచ్చిన భాగాన్ని పునరాక్రమించడమేగాక, ఓరెల్ వైపుకు ముందుకు సాగుతున్నాం. జర్మనకు పరాజయం కల్గించే ఈయుద్ధాలలో, సోవియట్ సైన్యాలు, మంచి యోధలక్షణాలను, ఇదివర కెరుగనంతటి పట్టుదలను, దృఢసంకల్పాన్ని, ధైర్యసాహసాలను ప్రదర్శించాయి. జర్మన్ల వేసవిదండయాత్ర పూర్తిగాభగ్నమయిందనే చెప్పాలి. జర్మన్లు ఎప్పుడూ వేసవిదండయాత్రలో జయం పొందుతూ వుంటారనీ, రష్యన్లు వెనుకంజ వేస్తారనీ, చెప్పే కథలో బండారం బయటపడింది.

జులై 5-23 తేదీలలోగా జర్మన్లకు కల్గిన నష్టాలివి: 70 వేలమంది ఆఫీసర్లూ, సైనికులూ మరణించారు. 2900 టాంకులు, 195 సెల్ఫ్ ప్రొపెల్డ్ గన్సు, 844 ఫీల్డుగన్సు 1392 విమానాలు, 5 వేల లారీలు నాశనంగావడమో పనికిరాకుండా పోవడమో జరిగింది."

ఓరెల్ రంగంలో సోవియట్ గావించిన దాడిని, సోవియట్ యావత్తురంగానికి విస్తరింపజేసి, సోవియట్‌మట్టిలోనే జర్మను సైన్యాలను మంటగల్పునట్లుగా, రెడ్ఆర్మీ దాడిసాగిస్తుందా అనే ప్రశ్న రావచ్చు. అది పశ్చిమ ఖండంలో మిత్రరాజ్యాలపై ఆధారపడి వుంది. నార్వే, ఫ్రాంసు, యుగోస్లేవియా, గ్రీస్, ఇటలీలమీద దెబ్బతీసి, ప్రజా తిరుగుబాట్లతో తమ దండయాత్రను మిత్రరాజ్యాలు కలిపిననాడు, సోవియట్‌తూర్పునుండి హిట్లరుకు చావుదెబ్బ గొట్టితీరుతుంది. ఆచావుదెబ్బ తప్పక సోవియట్ చేతులలోనే వుంది. కాని, అది జరగాలంటే, పైనచెప్పినచోట్ల మిత్రరాజ్యాలు సైన్యాలను దింపాలి. అందుకు ఈనాడు మహదవకాశం దొరికింది.

సిసిలీ యుద్ధం

సిసిలీ యుద్ధక్రమం, ఇటలీ రాజకీయపరిస్థితులు ఇందుకు నిదర్శనం. సిసిలీలో అరింట అయిదుపాళ్ళు మిత్రరాజ్యాల వశమైంది. మర్సాలా, ట్రపానీ, పాలెర్మో అను రేవు పట్టణాలు వశంగావడంతో, సిసిలీ వాయువ్యభాగములో కొంతముక్క మాత్రమే మిగిలింది. ఇటాలియన్ 26 వ డివిజన్ లొంగిపోయింది. మరి మూడుదళాలు ప్రమాదావస్థలోవున్నాయి. మధ్యభాగంలో 'ఎన్నా' వశమయింది. ఇక తూర్పున మెస్సీనానుండి — కటేనియావరకు మాత్రం ముఖ్యభాగంవుంది. దాదాపు 110 వేల ఖైదీలు చిక్కారు. 100కి 40 విమానాశ్రయాలు మిత్రరాజ్యాల చేతులలో చిక్కాయి. కాబట్టి సిసిలీయుద్ధ భవితవ్యం వేరే చెప్పనక్కరలేదు. మిత్రరాజ్యాలకు విమానబలంలోనేగాక తక్కినవాటిలోకూడ ఆధిక్యత కన్పించుతోంది. కటేనియా, మెస్సీనాల పతనంతో, సిసిలీ పూర్తి అవుతుంది.

ముస్సోలినీ రాజీనామా

ముస్సోలినీ రాజీనామానిచ్చాడు. ఇది చాల ప్రాముఖ్యమైన ఘటన అని వేరే చెప్పనక్కరలేదు. ఇటీవలనే, రూజువెల్టు — చర్చిల్‌లు ఇటలీ ప్రజలకు తిరుగబడమని సందేశం పంపడం, రోమ్‌నగరంపై బాంబులు కురిపించడం, మన మెరిగినదే. ఇటీవలనే హిట్లరు—ముస్సోలినీల సమావేశం కూడా జరిగింది. ఇలాంటపరిస్థితులలో ముస్సోలినీ రాజీనామా ప్రాముఖ్యత ఏమిటి?

ఇటాలియన్ ప్రజలలో యుద్ధవిముఖత్వం ఏర్పడి, నైతికంగా పతనమయ్యారు. మిత్రరాజ్యాల విజయంవలన సైనికులలోను ప్రజలలోను గల్గిన నిస్పృహజూచి, పరిపాలకవర్గంలోని ఒకముఠా, సంధికి భయారై యుండవచ్చు. అనాడు ఫ్రాంసులో వలెనే, ఇప్పుడు బ్రిటను అమెరికాలకు క్రమక్రమంగా లొంగడానికి, ముస్సోలినీచే రాజీనామా ఇప్పించియుండవచ్చు. పెటైన్ జర్మన్లకు లొంగడానికి ఉపయోగపడినట్లు, మరోవ్యక్తి, ఇటలీలోనేడు రంగంమీదికి రావచ్చు.

ముస్సోలినీరాజీనామా సైనికులలో మరింత నైతికపతనం వ్యాపింపజేసి, ప్రజలూ- సైనికులూ తిరగబడడానికి ప్రోత్సాహమిస్తుంది.



ఇలాంటి పరిస్థితులలో మిత్రరాజ్యాల కర్తవ్యమేమిటి? ఇటలీలో యుద్ధంచేయకుండా తప్పుతుంది గాబట్టి "ఇటాలియన్ డార్లన్లను" వెదుకుదాం, అని చూడగూడదు. ఇటలీపై కూడా దండెత్తాలి. సిసిలీ యుద్ధచర్యలిదివరకే అల్బేనియాలో ప్రజలతిరుగుబాటుకు ప్రోత్సాహమిచ్చింది. ముస్సోలినీ రాజీనామా మరింత ప్రోత్సాహమిస్తుంది గ్రీసు-యుగోస్లేవియాలలోని గెరిల్లాల విజృంభణ ఇదివరకే తీవ్రమౌతోంది. కాబట్టి క్రీటులో విమాన దండయాత్ర గాక, దాన్ని వశపరచుకోవాలి. ఇలా ఇటలీ, క్రీట్, బాల్కన్ దేశాలపైన, అటు నార్వే, ఫ్రాన్సులపైన దండయాత్ర సాగించాలి. ముస్సోలినీ రాజీనామావల్ల కల్గిన మహదవకాశాన్ని మిత్రరాజ్యాలు పోగొట్టుకోరాదు. ఇందుకు ప్రజాశక్తుల ఐక్యతకూడా అండగా వుంది. ఇటీవల జీరో - అమెరికా ఇంగ్లండ్లు తిరిగి వచ్చాడు. ఉత్తరాఫ్రికాలో ఒక సంయుక్త ఫ్రెంచి సైన్యం ఏర్పడింది. ఇలా ఫాసిస్టు వ్యతిరేక ఫ్రెంచి సైనికులంతా ఒకే నాయకత్వాన, ఆఫ్రికాలో సైన్యంగా ఏర్పడడం, ఫ్రాన్సు విముక్తి ఉద్యమానికెంతోలాభకరం. అలాగే సోవియట్ యూనియన్‌లో ఏర్పడిన ఫ్రీజర్మన్ నేషనల్ కమిటీకూడా, జర్మనీలోని ఫేసిస్టు ప్రతికూల ఉద్యమానికి ఉత్సాహమిస్తుంది. భవిష్యత్ జర్మన్ ప్రజారాజ్యానికి సోవియట్ అండ ఉంటుందనికూడా, ఇది తెలియచేస్తుంది.

జపానుబలపడకుండాదెబ్బతీయాలి

అక్షరాజ్య కూటమిలో, ముస్సోలినీ రాజీనామావల్ల కల్గినదెబ్బ జపానుపైకూడా ప్రభావంకల్గించుతుంది. కాని జపాను యెడల మిత్రరాజ్యాలు కనపరచే వైఖరి చప్పగావుంది. అమెరికానౌకాబల ఉపాధ్యక్షుడు, 1949 దాకా జపానుతో యుద్ధంసాగాలంటున్నాడు. కల్నల్ నాక్సుకూడా, ఆత్మసంతృప్తితో ఉపేక్షగా వుండరాదంటూ, ఒకవిధంగా పైదానినే సపోర్టు చేశాడు. కలకత్తాలోని బ్రిటిషు పారిశ్రామికుల పత్రిక 'కేపిటల్' 1944 - 45 లలో గాని జపానుపై దండయాత్ర సాగదనీ, ఈలోగా జపానుకు బయట బర్మాలోనో, న్యూగినీలోనో, సోలమాన్సులోనో పోరాటం జరుగుతుందని అంటుంది. ఇది, బ్రిటిష్-అమెరికన్‌పరిపాలక వర్గంలోని ముఖ్యఅభిప్రాయానికి నిదర్శనం.

తమ సామ్రాజ్యం పునరాక్రమించుకొనే యుద్ధంగానేకాని, ఫాసిస్టు ఆక్రమిత ప్రజల స్వాతంత్ర్యయుద్ధంగా, దానిని వారు చూడటం లేదు. అందుకనే జంగ్-కే-షైక్, "విజయం నిజమే. కాని ఎంతకాలంలో, ఎంతనష్టంతో" అని ప్రశ్నించాడు. ఇప్పుడు జపానుపైదాడి సాగించితే, తక్కువకాలంలో మంచిఫలితాలను పొందవచ్చుననికూడా చెప్పాడు. జపానుకు వ్యవధి ఈయరాదు. అది అన్నిటినీ బలపరచుకొంటున్నది. 1943 లో, తనకున్ననౌకాబలంలో 3 వ వంతును ఇంకా నిర్మించాలని దానిప్లాను. అప్లాను పూర్తిఅయితే, జపాను ఇదివరలో కంటె మరింత బలపడుతుంది.

జంగ్-కై-షేక్ హెచ్చరికనే, టోజో ప్రసంగంకూడా తెలియచేస్తుంది. ఇటీవలనే "మన రక్షణలను దుర్భేద్యంగా చేసికొనడమేగాక, అంతిమ దండయాత్ర తీయడానికి ఎప్పుడూ సిద్ధంగావుండాలి." అని టోజో అన్నాడు. టోజో సయాంకు, రెండు మలయా రాష్ట్రాలనిచ్చి, నానిపాలకులను బుట్టలోవేశాడు. సింగపూర్ - కాంటన్ - షాంగై రహదారికి ఇబ్బందిలేకుండా వుండటానికి ఈయెత్తు. అలాగే, బర్మాలో, తన కీలుబొమ్మగా "బా-మా"ను పెట్టాడు. ఇప్పుడు మరొక కీలుబొమ్మను తెచ్చాడు. సింగపూర్‌లో, మలయా సింగపూరులలోని భారతీయులతో ఇండియా పంచమాంగదళం ఏర్పరచి దానికి సుభాస్‌బోస్‌ను కమాండర్ — ఇన్ — చీఫ్‌గా చేశాడు. ఈవిధంగా బర్మాలో స్థిరపడచుకోడం, ఇతరచోట్ల కీలుబొమ్మ ప్రభుత్వాలేర్పరచడం, బోసు పంచమాంగదళం ద్వారాను పేరాట్రూప్స్ ద్వారాను, అనైక్యతగానున్న భారతప్రజలపై దెబ్బగొట్ట జూడడం, నిజంగా చాల ప్రమాదకరమైన విషయం.

ఇలాంటి పరిస్థితులలో 1944 లోనో, 1949 లోనో జపానుపై యుద్ధం అనే భావనలు చాల హానికరమయినవి.

కాంగ్రెస్—లీగ్ ఐక్యత ఏర్పడటం ఇప్పుడు మరింత అవసరం. జాతీయైక్యత ఏర్పడితేనే, సుభాస్‌బోసు చేయతలపెట్టిన మాతృ ద్రోహాన్ని భగ్నంచేయగల్గుతాం. 26-7-43

—కామ్రేడ్ తుమ్మల వెంకటరామయ్య

(2 వ పేజీ తరువాయి) చేసే సబ్‌కమిటీలో కూడా కార్మికులకూ—ప్రజాసామాన్యానికి తగినంత ప్రాతినిధ్యం ఉండాలి.

3. ప్రజాప్రతినిధుల సహకారంతో దేశం అంతట తక్షణమే ధరలను తగ్గించి, రేషనింగ్ పరికారం బట్టను అమ్మించాలి

4. 3 నెలల గడువును యేమాత్రమూ హెచ్చించకూడదు.

వీరు మాతృద్రోహులు

ప్రజల నిత్యజీవిత సమస్యల గురించి ప్రభుత్వం-ప్రజలు కలిసి సవ్యంగా పరిష్కరించుకొనకపోతే, దేశం ఎలాంటి పరిస్థితిలో పడుతుందో చూదాం. సుభాష్‌బోస్ యీమధ్య సింగపూర్ రేడియోలో ఉపన్యసిస్తూ, "భారత స్వాతంత్ర్యసేన" ఒకటి ఏర్పడిందనీ, దానికి తాను సర్వసేనాని అనీ, ప్రకటించాడు. ఇంతే కాదు. ఆకాశ గుమ్మటాలలో (పారచూట్‌లు) కొందరు ఆకుపచ్చని నిక్కర్లు, తెల్లని చొక్కాలు, వంగపండురంగు తలపాగాలు ధరించి ఇండియాలో దిగుతారని ఆ రేడియో ప్రకటించింది ఈ మూడు రంగులు మన జాతీయ పతాకానికి చిహ్నాలు. దుస్తులుచూచి, నిజంగా వీరు స్వాతంత్ర్యాన్ని ప్రసాదించే వీరయోధులని ప్రజలు భావించాలట! కాని, యదార్థం ఏమిటి? ఈ "స్వాతంత్ర్య సైనికులు" భారత దేశంలో పుట్టినవారే కావచ్చు. జాతీయ దుస్తులే ధరించవచ్చు. కాని, వారు జపాను సామ్రాజ్యవాదుల ఏజంట్లు. ఏజపాన్ హంతకుల చేతులు చైనా ప్రజల రక్తంతోను తూర్పు బెంగాల్ ప్రజలరక్తంతోను, మలినమై ఉన్నాయో, అట్టి పైశాచిక పాలకుల ఊడిగం చేసే మాతృద్రోహులు, వీరు. వీరు మన దేశరక్షణలను భగ్నంచేసి, జపాన్ సేనలకు త్రోవసరిచేయడానికి వస్తున్నారు. దోపిళ్ళను రెచ్చగొట్టే ఫార్వర్డుబ్లాకును, ఇతర పంచమాంగదళాన్ని, బలపరచడానికి వస్తున్నారు. ఎందువల్లనంటే, నానాటికి భయంకర రూపం దాల్చుతున్న ఆహారసంక్షోభం తమకు తప్పక సహాయం చేస్తుందని వీరి నమ్మకం. కనుక అన్నిపార్టీల దేశభక్తులు - ఆహార కమిటీల ద్వారా యీ సమస్యను పరిష్కరించుకోవలసియుంది. దీనితోబాటు, గాలి గుమ్మటాలలో దిగే యీమాతృద్రోహుల్ని దిగినవెంటనే కట్టివేసి మిలటరీకిగాని, పోలీసులకుగాని అప్పజెప్పాలి. లొంగకపోతే హతమార్చాలి. 28-7-43

కలరా రాక్షసిని రూపుమాప కంకణంకట్టిన కమ్యూనిస్టుయోధులు

కన్ననూర్‌లో రెడ్‌గార్డులు, కలరా నిర్మూలన ఉద్యమాన్ని ఆదర్శవంతంగా గడుపుతున్నారు. ఒకవారం ఈ ఉద్యమాన్ని నడిపిన నిమ్మట, కన్ననూర్ హెల్తాఫీసరు ఇలా ప్రశంసించాడు. "అంటువ్యాధుల నిర్మూలించడానికి, పట్టణాన్ని శుభ్రపరచడానికి ముందుకు వచ్చిన ప్రజలు ప్రదర్శించే ఉత్సాహమూ - చిత్తశుద్ధీ - నా ఉద్యోగ కాలంలో ఎప్పుడూ నేను చూడలేదు."

జూన్ 26 వతేదీన కన్ననూర్‌లో ముగ్గురకు మాత్రమే కలరా తగిలింది. అయినా పట్టణంవదలి పల్లెకు పారిపొమ్మని పంచమాంగదళం ప్రచారం చేయసాగింది.

డాక్టర్ టి. డి. నాయర్, డాక్టర్ ఆర్. కె. తంపీ, అను ప్రసిద్ధ డాక్టర్లు 115 మంది కమ్యూనిస్టు వర్కర్లకు కలరా నివారణోపాయాలు తెలియజేశారు. తాలూకా కమిటీ ఆధ్వర్యాన జరిగిన స్కూళ్ళలో వీరుపన్యసించారు.

మరుసటి దినాన 40 మంది (వీరందరికి కలరా రాకుండా టీకాలు వేయబడ్డాయి) కమ్యూనిస్టులు 8 దళాలుగా మారి, 793 ఇండ్లలో, 1353 మందికి కలరా నివారణ మార్గాలను బోధించారు. జూలై నాల్గవ తేదీన 180 మంది వలంటీర్లు, పారలు, చీపుళ్ళు, బళ్ళు తీసుకొని వీధులు బాగుచేయ సాగారు. కొందరు శుభ్రం చేస్తుంటే, మరికొందరు ప్రచారం చేయసాగారు.

వలంటీరుల పని ప్రజల నాకర్షించింది. తమంతకుతామే వచ్చి సహాయపడ్డారు. కొన్నిచోట్ల ముఖ్యంగా స్త్రీలు, వలంటీర్లను ఊడ్వనియకుండా, తామే ఊడ్చారు. నాల్గుచోట్ల సభలు జరిగాయి. వాలంటీర్లు 160 ఇండ్లను, 40 షాపులను సందర్శించారు. 2116 మందికి, కలరా నివారణ మార్గాలను విశదీకరించారు.

చిరక్కల్ తాలూకాలో, అఖిలపక్ష కలరా నివారణ సంఘం ఏర్పడింది, కాంగ్రెసు- లీగ్- కమ్యూనిస్టుల ప్రతినిధులిందులో వున్నారు. డాక్టరు తంపీ దీనికి జనరల్ సెక్రటరీ. ఒక ప్రముఖ ముస్లింలీగరు "అంటువ్యాధులు ప్రజాబలాన్ని, మనోధైర్యాన్ని, నాశనంజేసి, ఆపాను దాడికి దేశాన్ని గురిచేస్తాయి. కాబట్టిమనం ఐక్యతతో ప్రజలను ఆకలినుండి, అంటువ్యాధులనుండి రక్షించుదాం" అన్నాడు.

ఈ కలరా నివారణ సంఘంఅందగా వున్న రెడ్ గార్డుల స్వార్థత్యాగం, దేశభక్తి ప్రజలలో ఆత్మవిశ్వాసం, కల్గించింది. బాధ-అపాయాలమధ్య ప్రజలలో నూతన ఐక్యత ఏర్పడింది.

గత డిశంబరులో కలరా వచ్చినప్పుడు, తిండిలేకపోవడం వల్లనే కలరా వచ్చిందని జిల్లా ఆరోగ్యాధికారులు తెలియ జేశారు. జనవరిలో కొంతవరకు ఆహార పరిస్థితి బాగుపడింది, కలరా కూడా తగ్గింది. కాని మార్చిలో, ఆహార పరిస్థితి విషమించింది. తిండి దొరక్కపోవడం వల్ల, వస్తులు పడుండటంవల్ల, మల్లాజూన్‌లో కలరావచ్చింది. కాని ఈసారి చాలతీవ్రంగా వచ్చింది. డిశెంబరులో కలరా వల్ల 100 మంది మాత్రమే చనిపోయారు. కాని జూలై 5 న ప్రకటించిన అధికారప్రకటన ప్రకారం, ఒక్కనెలలో, ఒక్క కాలికట్‌లోనే 704 మందికి తగిలి, 608 మందిచనిపోయారు. ఇంతేగాదు. అన్నిచోట్లకు ఇదిప్రాకుతోంది. తానూరు అనేగ్రామంలో 155 మంది కలరావల్ల చనిపోయారు. 2 రోజులలో, తిరూర్ రేంజిలో 55 మంది. మొత్తం, కాలికటుగాక ఇతర ప్రదేశాలలో 400 మంది చనిపోయారు. కొత్తాయంలోప్లేగువల్ల ఆర్గురు చనిపోయారు. (జూన్ 6 నుండి జూలై 16 లోగా కాలికట్‌లో 1437 మందికి కలరాతగిలిందని, 1176 మంది చనిపోయారని, ఇటీవలి వార్త)

కమ్యూనిస్టుపార్టీ పత్రిక "దేశాభిమాని", ఆరోగ్యాధికారుల సహకారంతో, అన్నిపక్షాల ప్రజలూ, అంటువ్యాధులను నిర్మూలించప్రయత్నించాలని ఉద్బోధించింది. పార్టీసభ్యులు - సానుభూతి పరులూ రాత్రింబవళ్లు కృషిచేసి కలరా నిర్మూలించాలని, ప్రబోధించింది.

కన్ననూర్‌లో కమ్యూనిస్టులు ఎలాకృషి చేసిందీ చూశాం. ఇకఇతర చోట్ల చూదాం.

కాలికట్‌లో 25 గురు వలంటీర్లు, కలరా తగిలిన ప్రదేశానికివెళ్ళి, మందులు సప్లయి చేశారు. కలరా నివారణ ఉపాయాలను ప్రచారం చేశారు. పేదలకు తిండి పెట్టడానికి 285 రూపాయలు వసూలుచేశారు.

పెల్లిచెరిలో, ముస్లింలీగ్ చొరవదీసుకొని ముందడుగుకు వేసింది. పౌరసంఘం ఒకటి అంటువ్యాధుల నివారణ కృషికిగాను ఏర్పరచారు. 1215 రూపాయలు వసూలు చేశారు. ప్రతిరోజూ, పేదప్రజలకు 5 బస్తాల బియ్యం పంచిపెడుతున్నారు.

మలబారులో పలుప్రాంతాలనుండి ఇలాంటి కథలే వినవస్తున్నాయి. కాని ఇది ఇంకా ప్రారంభం మాత్రమే. మళ్ళీ పంటలు రావడానికి, మామూలు పరిస్థితులలో ఇంకా మూడు నెలలు పడుతుంది. అపుడు కొంచెం ఆహార పరిస్థితి సుళువుగావచ్చు. కాని ఈలోగానో? అంటువ్యాధులను నిర్మూలించుటలోను, ప్రజలకాహారం సప్లయిచేయుటలోను, కన్ననూరును ఉదాహరణగా తీసుకొని అన్నిపార్టీలు పనిచేస్తేనే ఆకలినుండి, అంటు వ్యాధులనుండి, మృత్యువునుండిమలబారుతప్పించుకొని బయటపడగలదు.

★

బాలసంఘంవల్ల బాగుపడిన బాలుడు

దెందులూరు (ప. గోదావరి) బాలసంఘ సభ్యులు 140 ఇండ్లవద్ద రాయలసీమ నిధికి 17 మరకాల బియ్యం (4 శేర్లు 1 మరకం) 81 గుడ్డలు, రు 7-5-0 వసూలుచేశారు. పచ్చలతాడిపర్రు (గుంటూరుజిల్లా) బాలసంఘం కూడా ఇంటింట తిరిగి బియ్యం, వస్త్రు డబ్బు పోగుచేశారు. ఇలాంటిపనులకు బాలసంఘాలు పూనుకొని, కాలాన్ని సద్వినియోగం చేయడం ఎంతైనా మంచిది.

తోటిబాల్యుణ్ణి రక్షించాడు

ఎవరైనా బావిలోపడితే కుయ్యో, మొర్రో అంటూ, ఏమీ తోచక దిగాలుపడడం చాలామందికి అలవాటు. కాని నెల్లూరు బాలుడు అలా చేయలేదు. బాలసంఘం ఆడుకొనే ప్రదేశంలో ఒక బావిలో పడ్డ కుర్రాణ్ణి, 13 ఏండ్ల బాలసంఘ సభ్యుడు, తీసి రక్షించాడు. ఇలా అద్భుతసాహసం ప్రదర్శించడంవల్ల, కుర్రాణ్ణి రక్షించడమేగాక, తమ సంఘానికి కూడా సహాయపడ్డాడు. రక్షింపబడ్డ బాలుడు సంఘంలో చేరి పనిచేస్తున్నాడు.

పొగరుబోతు మారిపోయాడు

అమృతలూరు (తెనాలి తాలూకా) బాలసంఘం, ఆటపాటలు, సమావేశాలు, ఊరేగింపులు, డ్రిల్లు మొదలైనవాటితో, చక్కని అలవాట్లను నేర్పుకుంటూంది.

ఆగ్రామ ఎలిమెంటరీ స్కూలు బాలుడొకడు పొగరుబోతు. పాఠాలు చదవడు. మాష్టర్ల మాట వినడు. అల్లరిజాస్తి. మాష్టరుకు విసుగుబుట్టి వదలివేశాడు. కాని బాలసంఘంలో చేరాక, పొగరుబోతుతనం పోయింది. ఈ మార్పుజూచి, మాష్టరుగారు కూడా బాలసంఘానికి ప్రోత్సాహ మిస్తున్నారు. ఇదివరకు వ్యతిరేకించిన తలిదండ్రులు కూడా బాలసంఘాలను ప్రోత్సహిస్తున్నారు.

బాలికాపాఠశాలలో జాతీయగీతాలు పాడేటట్లు ఉపాధ్యాయుల్ని బాలసంఘంవారు ఒప్పించారు. తెనాలిలో జరిగిన కమ్యూనిస్టు మహాసభలో వీరు వలంటీర్లుగా పనిచేసి, మన్నన పొందారు. ఇతరతరగతుల్లో కూడ బాలసంఘాలు తామే నిర్మించుతున్నారు. గ్రామంలో గడ్డివామి తగుల బడినపుడు ఆర్పుటలో సహాయపడ్డారు.

కథలద్వారా సంఘనిర్మాణం

విశాఖపట్టణం జిల్లా గుల్లలపాలెంలో ఒక బహిరంగసభ జరిగింది. అచ్చటికి వచ్చిన 50మంది బాలబాలికలకు, కామ్రేడ్ సరోజని బాలసంఘ విధులు నేర్పి, బాలసంఘాలలో పిల్లలను చేర్పించవలసిన బాధ్యతను గూర్చి ఒక చిన్న కథ చెప్పింది. అతి పుత్సాహంతో బాలబాలికలు సభ్యులుగా చేరారు.

బాలసంఘం పాటలు

పొట్లపాడు (కృష్ణా) బాలసంఘం, ప్రతి శని, ఆదివారాలలో, ఆటపాటల కార్యక్రమాన్ని నిర్వర్తించుతున్నారు. వారు పాడే పాటలలో ఒకభాగం ఇది:

"బాలసంఘం జేర భయమేల మనకు?
చిలిపిపనులు జేయ బులుపేల మనకు?
కోతిపనులు మనము చేయకూడదు
ఇంటిలో మారాము ఇసుమంత వలదు
శ్రిద్దగా పాఠాలు చదివితీరాలి
నిత్యమూ స్నానమూ చేసితీరాలి"

ఈవిధమైన, తేలికగా అర్థమయేపాటలతో బాలురజీవితం సరిదిద్దబడుతోంది.

బాలసంఘాల నిర్మాణం

గుంటూరుజిల్లాలో, ఈక్రింది గ్రామాలలో బాలసంఘాలుఏర్పడి ఆదర్శవంతంగా పనిచేస్తున్నాయి. గోవాడ, దావులూరు, యలమర్రు, దుగ్గిరాల, చిలువూరు, నల్లూరుపాలెం, పల్లెకోన, రేపల్లె, వెల్లటూరు, ఒంగోలు, పొందూరు, ఉప్పుగొండూరు, కుక్కపల్లివారిపాలెం, వేలూరు గోరంటవారిపాలెం, నర్సాయిపాలెం, బొడారుపల్లి, పొన్నెకల్లు, తాడికొండ, ఫిరంగిపురం. | విశాఖపట్టణం జిల్లా లావేరులోను, నెల్లూరు, వెంకటగిరిలలోను బాలసంఘాలేర్పడినయి. మైలవరం, ఈడ్పుగల్లు గ్రామాలలో బాలసంఘాలు ఎప్పటికప్పుడు తమ కార్యకలాపాన్ని పునర్విమర్శించుకుంటూ సక్రమ పద్ధతులపైన, నడుస్తున్నాయి.

అధికోత్పత్తికి ముందంజవేసిన ఆదర్శవీర కార్మికులు

కాలికట్‌లో తిరువన్నూరు కాటన్ మిల్లు వుంది. కమ్యూనిస్టుపార్టీ ఆదేశానుసారం అక్కడి కార్మికులు, ఉత్పత్తిలో నైపుణ్యం చూపించారు. గతసంవత్సరం, రోజుకు 9 గంటలు పని చేస్తూ, రోజు 1 కి 5240 పౌనుల నూలును, ఉత్పత్తిచేసేవారు. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో, దేశభక్తులైనకార్మికులు ఉత్పత్తిని 5580 పౌనులకు పెంచారు. జూన్‌లో, 6240 పౌనులకు పెంచారు. ఇంతేగాదు, వృధా అవుతున్న 1000 పౌనుల తుక్కునుండి, పదో నంబరువారం 520 పౌనులను తీయవచ్చునని మేనేజ్‌మెంటుకు చూపించారు.

కార్మికుల యీ దేశభక్తి, యజమానులను కూడ కదిలించింది. లాభాలన్నీ తమ జేబులలో వేసుకోకుండా, వారు కార్మికుల జీతాలను పెంచారు. అధికధరల అలవెన్సును పెంచారు. 3 నెలల బోనస్ ఇచ్చారు ఆహారపదార్థాల చౌకడిపోలు పెట్టారు.

బొంబాయి కార్మికుల ఆదర్శ పంథా

బొంబాయి న్యూయూనియన్ మిల్సు కార్మికులు, పేకదారం లేకపోవడంవల్ల సాయంత్రం నాల్గుగంటలకే పని ఆపవలసివచ్చేది. అందువల్ల 2½ గంటలనష్టం కార్మికులకుకూడా అందువల్ల తక్కువకూలీ వచ్చేది. కమ్యూనిస్టు కార్మికులు, రోవింగు - స్పిన్నింగ్ (కండెలు చుట్టే, నూలుతీసే) డిపార్టుమెంటుకు వెళ్ళి, ఈకొరత తీరేటట్లు పనిచేయండని కోరారు. వారు, తమకాలంలోనేగాక, అదనంగా పని చేయ సిద్ధమయ్యారు. యజమానులుకూడా అంగీకరించారు. ఇందువల్ల, మగ్గాలు పూర్తి కాలం పనిచేయసాగాయి.

ఈ విధంగానే, 'న్యూచైనా' మిల్లు (బొంబాయి) లో తగినన్ని (కండెలు) లేక ఉత్పత్తి తగ్గికది. రామ్‌భేపటేల్ అనే కమ్యూనిస్టు కార్మికుడు యజమానులకు పరిస్థితిని బోధించి, వాటిసప్లయి వచ్చేటట్లు చూచాడు. అందుమూలంగా ఉత్పత్తి 100 కి 10-12 చొప్పున వృద్ధి అయింది. ఈవిధంగా యజమానులు కార్మికులు సహకారంగాఉంటే, అధికోత్పత్తి గావించి, ప్రజలను బట్టల కరువునుండి కాపాడవచ్చు.

ప్రజలకోసం, దేశరక్షణకోసం ఉత్పత్తిని అధికంగావించితే, కార్మికులు తమ కోర్కెలు కూడా తీర్చుకోగల్గుతారనడానికి ఇంతకంటె మరో నిదర్శనం ఏంకావాలి?

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet, Bezwada.

END OF ISSUE